


2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..
గుంటూరు - శుక్రవారం 23 అక్టోబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 288 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5



తమ దేశ స్వాతంత్ర్య దినోత్సవాలకు అతిథిగా రావాలంటూ ప్రధాని మోడీని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆహ్వానించారు

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు, అక్టోబర్,22,(మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా నిడదవోలు పట్టణంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విస్తృతంగా పర్యటించారు. కూటమి మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతితో పాటు స్థానిక కూటమి అభ్యర్థులతో కలిసి ఆయన నిడదవోలు పట్టణంలోని 7,10, 23, 24, 25 వార్డులతో పాటు వైఎస్సార్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. 7వ వార్డు

...మిగతా 2లో




# ఏపీ పారిశ్రామిక ప్రగతిలో సరికొత్త అధ్యాయం

(అమరావతి, పి. మీరాహుస్సేన్, మనం ప్రత్యేక ప్రతినిధి): అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశం, రాష్ట్రంలో భారీ ఉపాధి కల్పనతో పాటు సరికొత్త పారిశ్రామిక ఎకో-సిస్టమ్ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్స్ ... ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త నినాదంతో గ్రామీణ స్థాయి వరకు ఐటీ, డీప్-టెక్, గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలను విస్తరిస్తూ, ఆంధ్రప్రదేశ్ను గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ హబ్గా మార్చేందుకు ఈ సమావేశం దిక్సూచిగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో మంత్రులు నారా లోకేష్,

...మిగతా 2లో

> పరిశ్రమల ఏర్పాటుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మంత్రంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూసుకుపోతున్నారు. కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులు త్వరితగతిన ప్రారంభం కావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

## గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య.



విజయవాడ, అక్టోబర్ 22,(మనం న్యూస్): గోదావరి పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి, వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను సమర్థవంతంగా సేకరించి రీసైక్లింగ్ చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ

...మిగతా 2లో

## ఫ్రాన్స్ వెళ్తున్నారా..? జాగ్రత్త

భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ



5



2

## సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా ధర్మానా..? అసలు నీకు అర్థమయ్యాయా..?

- సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి చెంపదెబ్బ అంటూ తప్పుడు ప్రచారం
- 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదు
- నిమ్మగడ్డ రమేష్కుమార్ను అక్రమంగా తొలగించిన చరిత్ర మీది కాదా..?
- ప్యాలెస్లో జగన్ రెడ్డి ఆదేశాలతోనే గొడ్డలి పార్టీ రౌడీమూకల అరాచకాలు
- వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజం

# అదే తీరు... మారని హింసాత్మక ఘటనలు

- టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు
- వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్

2

పరిషత్ ఎన్నికల్లో తీరు మారలేదు. హింసాత్మక ఘటనలు జరిగాయి. అనేక చోట్ల నామినేషన్ల పత్రాలను ప్రత్యర్థుల నుంచి తీసుకుని చించేశారు. పోలీసులు చేతులెత్తేశారు. ఇలాంటి ఘటనలు కూడా ఎక్కువ రాయలసీమలోనే జరిగాయి. కడప జిల్లాలో నిన్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా వేయలేక పోయింది. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జడ్పీ ఎన్నికల్లోనూ అదే తీరు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది.




## విపత్తులను తప్పించలేం

ప్రకృతితో మమేకమై జీవించాలి: వెంకయ్యనాయుడు



2

# జాగో..!

## ఎల్నినోను ఎదుర్కొందాం

ప్రకృతి విపత్తుపై 'మన'ం యుద్ధం

manamelnino2026@gmail.com, whatsapp no 9133199333

ఎల్నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్కు పంపించండి.

– ఎడిటర్

## తొలి టీ20లో కివీస్పై రికార్డు విజయం




8

## బీఈఎల్తో రక్షణ ఒప్పందం

రూ.770 కోట్ల విలువైన లైట్ వెయిట్ రాడార్ల కొనుగోలు



5

## ఎన్నికలు... రీ షెడ్యూల్



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్లో జరగాల్సిన మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ను రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో కీలక మార్పులు చేస్తూ కొత్త తేదీలను ప్రకటించింది. వాస్తవానికి ఈ నెల 28న జరగాల్సిన పోలింగ్ను నవంబర్ 1వ తేదీకి వాయిదా వేయగా, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎదుర్కొన్న అడ్డంకులు, దాడుల ఘటనలను పరిగణలోకి తీసుకుని

...మిగతా 2లో

## అందరికీ నమస్కారం..

ఇన్ స్టాలో సోనియా తొలి పోస్టు

5



## లాడెన్ దాసుకున్న చోటే దావూద్ దాసుకుండు

తెలుసుకొని మాట్లాడండి: మండిపడిన భారత్

న్యూయార్క్, అక్టోబర్ 22 : ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదిక తప్పులతడకగా ఉందని భారత్ తీవ్రంగా ఖండించింది.



అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం గురించి చేసిన ప్రస్తావనలు తోసిపుచ్చింది. దావూద్ డీ-కంపెనీ 'భారత్కు చెందిన క్రిమినల్ గ్రూప్' అని పేర్కొనడంపై మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘూ పూరి మాట్లాడారు.

అల్ ఖైదా తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై 2003లో భారత దేశానికి చెందిన డీ-కంపెనీ నాయకుడిని ఐరాస భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాది జాబితాలో చేర్చింది. ఆ ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలో ఈ మాట

...మిగతా 2లో

## యునెస్కో తాత్కాలిక జాబితాలో భారత్ నుంచి 3 ప్రాంతాలు



ప్యారిస్, అక్టోబర్ 22 : భారతదేశం నుంచి కొత్తగా మూడు ప్రదేశాలను ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ-యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చారు. ఒక ప్రదేశానికి ప్రపంచ వారసత్వ హోదా ఇచ్చే విషయం పరిశీలించాలంటే, దాన్ని మొదట యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చాలి. అండమాన్-నికోబార్ ద్వీప సముదాయానికి చెందిన బరాటాంగ్ దీవిలోని బురద అగ్నిపర్వతం, అండమాన్ సబ్ డక్షన్ అగ్నిపర్వతాలైన నార్కొండమ్-బారెన్ దీవులు, ఛత్తీస్గఢ్ లోని సిర్పూర్ సాంస్కృతిక-పురాతత్వ ప్రాంతాన్ని తాజాగా యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చారు. యునెస్కో వెబ్ సైట్ ప్రకారం, భారతదేశ యునెస్కో శాశ్వత ప్రతినిధి బృందం సెప్టెంబర్ 28న ఈ ప్రతిపాదనను పంపింది. మధ్యప్రదేశ్ లోని ఉదయగిరి గుహలు, భారత్, దక్షిణాఫ్రికాలలో గాంధీజీ సత్యాగ్రహంతో ముడిపడి ఉన్న ప్రదేశాలతో పాటు మొత్తం నాలుగు ప్రదేశాలను ఇటీవలే భారతదేశ యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు అధికారులు సెప్టెంబర్ 30న తెలిపారు. ఇప్పుడు యునెస్కో తాత్కాలిక జాబితాలో భారత్ కు చెందిన మొత్తం 81 ప్రదేశాలు ఉన్నాయి. వీటికి తోడు తాజాగా ప్రతిపాదించిన

...మిగతా 2లో

నోబెల్ రాలేదు..

## కనీసం పులిట్జర్ అయినా ఇవ్వరా?

అవార్డుల కోసం అర్రులు చాస్తున్న ట్రంప్



వాషింగ్టన్, అక్టోబర్ 22 : ప్రపంచవ్యాప్తంగా అనేక యుద్ధాలను ఆపానని.. అందుకు నోబెల్ శాంతి బహుమతి వచ్చి తీరాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రకటించుకున్న విషయం తెలిసిందే. ఇలా పలుసార్లు ఆశించి భంగపడిన ఆయన.. చివరకు మరో పురస్కారంపై కన్నేసినట్లు తెలుస్తోంది. తనకు నోబెల్ రాలేదని.. కనీసం తన రచనలకు పులిట్జర్ వచ్చి ఉండాల్సిందని మరోసారి అసంతృప్తిని వ్యక్తం

...మిగతా 2లో

# డ్రైవింగ్ లైసెన్స్ రావాలంటే 75% మార్కులు రావాల్సిందే!

**ఢిల్లీ, అక్టోబర్ 22 :** డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు సంబంధించి కేంద్రం కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కోసం నిర్వహించే ఆన్ లైన్ అసెస్ మెంట్ పరీక్ష పాస్ మార్కులను 60 శాతం నుంచి 75 శాతానికి పెంచింది. డ్రైవింగ్ పై అవగాహన కోసం నిర్వహించే ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు సాగాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. భాగస్వామ్యపక్షాల నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

**గడవు దాటి నిర్ణయం చెప్పకపోతే అమోదం పొందినట్టే...**

కొత్త ప్రతిపాదనల ప్రకారం.. పేరు, చిరునామా వివరాల మార్పు కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 15 రోజుల్లోగా ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలి. ఒకవేళ తిరస్కరిస్తే తగిన కారణం తెలపాల్సి ఉంటుంది. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. ఆధార్ అథంటికేషన్ ద్వారా ఆన్లైన్లో పొందే కొన్ని డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని భావిస్తున్నారు. పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాల మార్పులకూ ఛార్జీలు తొలగించనున్నారు.

**పాత బండికి.. కొత్త లెక్కలు.. గ్రీన్ ట్యాక్స్, ఆర్సీ రెన్యువల్ తప్పనిసరి..**

గుర్తింపు, వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, పాస్ పోర్ట్, ఓటర్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఇ-రేషన్ కార్డు, గడిచిన 3 నెలల్లోపు వచ్చిన విద్యుత్, గ్యాస్ బిల్లులను అనుమతిస్తారు. చిరునామా ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఎల్ఐసీ పాలసీలను తొలగించాలని ముసాయిదా పేర్కొంది. అలాగే, కొత్తగా జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యువల్ లైసెన్సులను లేమినేటెడ్ లేదా పీవీసీ కార్డు రూపంలో జారీ చేయాలని ముసాయిదాలో కేంద్రం తెలిపింది.

# లాడెన్ దాసుకున్న చోటే దావూద్ దాసుకుండు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. 'మా దేశం గురించి ప్రస్తావించిన కొన్ని తప్పులను మీ ముందు ఉంచుతున్నాం. 'డీ కంపెనీ' అంటూ మీరు ప్రస్తావించిన వాక్యాన్ని విడిగా చదివితే.. వాస్తవాలకు విరుద్ధమైన అర్థం వస్తుంది. 1993లో జరిగిన ఉగ్రదాడులకు సంబంధించి ఆ నేర సంస్థ, ఆ నాయకుడు భారత్ లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ఈ వాస్తవాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం. ప్రత్యేక పదవులను చేపట్టిన వారి నుంచి ఇలాంటి అసమర్థ వ్యాఖ్యలు ఐరాసకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని ఆయన విమర్శించారు.

వాస్తవం ఏంటంటే.. 2003లో ఐరాస అతడిని ఉగ్రవాది జాబితాలో చేర్చకముందే భారత్ నుంచి పారిపోయాడు. అల్ ఖైదా, ఒసామా బిన్ లాడెన్ తో ఉన్న సంబంధాల కారణంగా అతడిని ఆ జాబితాలో చేర్చింది. అప్పుడు అతడు భారత్ లో లేడు. బిన్ లాడెన్ ఎక్కడైతే నక్కి, ప్రాణాలు కోల్పోయాడో.. దావూద్ ఇబ్రహీం కూడా ఆ దేశంలోనే ఉన్నాడని ఐరాస జాబితాను బట్టి స్పష్టమవుతోంది' అని రఘుపూరి తేల్చిచెప్పారు. 2001లో అమెరికాలో మారణహోమం సృష్టించిన బిన్లాడెన్కు పాకిస్థాన్ ఆశ్రయం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో అగ్రరాజ్యం నిర్వహించిన ఆపరేషన్లో లాడెన్ హతమయ్యాడు.

# కనీసం పులిట్జర్ అయినా ఇవ్వరా?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. 'నాకు నోబెల్ బహుమతి రాలేదు. పులిట్జర్ కూడా రాలేదు. కనీసం నా రచనలకు పులిట్జర్ వచ్చి ఉండాల్సింది. రష్యా అనే అంశంపై కథనాలు రాసినవాళ్లకు వచ్చింది. రాకూడని వాళ్లకు వచ్చింది. వాళ్లకు రావాల్సింది కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

సౌత్ కరోలినా సభలో పాల్గొన్న ట్రంప్.. తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గతంలో అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యంపై కథనాలు రాసిన జర్నలిస్టులు పులిట్జర్ ప్రైజ్ గెలుచుకోవడంపై విమర్శలు గుప్పించారు. వారి రిపోర్టింగ్ తప్పుగా ఉందని, తనను లక్ష్యంగా చేసుకొని రాశారని ఆరోపించారు. ఇదిలాఉంటే, జర్నలిజం, పుస్తకాలు, నాటకం, సంగీతం రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచే వారికి పులిట్జర్ పురస్కారాన్ని అందిస్తారు.

# యునెస్కో తాత్కాలిక జాబితాలో భారత్ నుంచి 3 ప్రాంతాలు

(మొదటి పేజీ తరువాయి)

మూడు ప్రదేశాలలో ఒకటైన బరాటాంగ్ బురద అగ్నిపర్వతం భారతదేశంలోని ఏకైక మట్టి అగ్నిపర్వతం. ఇది సాధారణ అగ్నిపర్వతంలా వేడి వేడి లావాను కాకుండా చల్లగానో, కాస్త వెచ్చగానో ఉండే బురదను ఎగజిమ్ముతుంది. భూగర్భంలోని నీరు, ఖనిజాలు, సహజ వాయువులు ఒత్తిడికి గురై బురదను పైకి నెట్టడం వల్ల ఈ మట్టి అగ్నిపర్వతం ఏర్పడుతుంది. బర్మా భూఫలకం కిందకు భారతీయ భూ ఫలకం చొచ్చుకుపోవడం (సబ్ డక్షన్) వల్ల అండమాన్-నికోబార్ దీవులు ఏర్పడ్డాయి. ఇలా రెండు భూ ఫలకాలు లేదా పొరలు పరస్పరం ఢీకొన్నప్పుడు అగ్ని పర్వతాలు ఏర్పడతాయి. అండమాన్ ద్వీప సముదాయంలో భాగమైన నార్కొండమ్, బారెన్ దీవులు 26 లక్షల సంవత్సరాల క్రితం ఇలానే ఏర్పడిన సబ్డక్షన్ అగ్నిపర్వతాలని యునెస్కో వెబ్సైట్ పేర్కొంది.

ఛత్తీస్ గఢ్ లోని మహాసముంద్ జిల్లాలో ఉన్న సిర్పూర్ (శ్రీపూర్) గ్రామం జాతీయ స్మారక చిహ్నం. ఈ ప్రదేశం ఛత్తీస్ గఢ్ రాజధాని రాయ్ పూర్ కు 78 కి.మీ దూరంలో మహానది తూర్పు ఒడ్డున ఉంది. ఈ చారిత్రక పట్టణం శర్భపురీయ రాజవంశం ఆధ్వర్యంలో కోసల రాజ్యానికి రాజధానిగా నిర్మితమైంది.. ఈ పట్టణం పాండువంశీ రాజవంశం ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందిందని యునెస్కో వెబ్సైట్ తెలిపింది. సిర్పూర్ ప్రాంతం సున్నపురాళ్ల నిక్షేపాలున్న చోట నెలకొని ఉన్నది. ఈ నిక్షేపాలు కోట్ల సంవత్సరాల పాటు సైనోబాక్టీరియా ద్వారా ఏర్పడిన శిలాజ పొరల వంటి అవక్షేప నిర్మాణాలు. అందుకే ఈ ప్రాంతాన్ని యునెస్కో పరిశీలనకు పంపారు.

# ఏపీ పారిశ్రామిక ప్రగతిలో సరికొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

టీజీ భరత్ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ భేటీలో ఎస్.ఐ.బి.పి. అనుమతి పొందిన ఏ ప్రాజెక్ట్ అయినా గరిష్ఠంగా 6 నెలల లోపు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించాల్సిందేనని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ఇన్సెంటివ్లు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఎటువంటి ఆలస్యం లేకుండా నేరుగా బదిలీ అయ్యేలా రియల్-టైమ్ ఎస్క్రో ఖాతా విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పోర్టులు, షిప్బిల్డింగ్, లాజిస్టిక్స్, వేర్హౌస్లు అనుబంధ పరిశ్రమలను అనుసంధానించే సమగ్ర మౌలిక సదుపాయాల వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సెమీకండక్టర్లు, చిప్ డిజైనింగ్, రోబోటిక్స్ మరియు క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాలలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్లలో మౌలిక వసతులను వేగవంతం చేయనున్నారు. రాష్ట్రంలో నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 113.75 గిగావాట్ల సామర్థ్యానికి సంబంధించిన పెట్టుబడులను సురక్షితం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే తిరుమల లో ఎలక్ట్రిక్ బస్సులు, ఛార్జింగ్ స్టేషన్ల ద్వారా నెట్-జీరో సాధించాలని సీఎం ఆదేశించారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి జనసేన అభ్యర్థి గుర్రం శాంతి శ్రీ, 10వ వార్డు టిడిపి అభ్యర్థి మహమ్మద్ షకీనా అన్సారీ బేగం, 23వ వార్డు కూటమి టీడీపీ అభ్యర్థి గొబ్బిళ్ళ ఫణిరాజ్, 24వ వార్డు బీజేపీ అభ్యర్థి సన్నిధి శ్రీనివాస్, 25వ వార్డు జనసేన అభ్యర్థి మాడిపాటి నాగమణిల తరపున ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. క్షేత్రస్థాయిలో వార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన సాధ్యపడాలంటే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఒక ఓటు కూటమి మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థికి, మరొక ఓటు స్థానిక వార్డు కూటమి అభ్యర్థికి వేసి విజయాన్ని అందించాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. గడిచిన రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని, అభివృద్ధికి మద్దతుగా నిలిచి కూటమికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారానికి ముందు మంత్రి దుర్గేష్ స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అదేతీరు... మారని హింసాత్మక ఘటనలు

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః** టీడీపీ, వైసీపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అపహాస్యానికి లోనయిందనే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలకు టీడీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. వైసీపీ నేతలే దాడులకు తమపైకి దిగుతూ ఎదురుదాడికి దిగుతున్నారని అంటున్నారు.

**ఆరోపణలు...**

కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం లేదా బలవంతపు ఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటాయి.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగాలని మరియు హింసకు తావులేకుండా చూడాలని ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. పోలీసులు అభ్యర్థులకు భద్రత కల్పించాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. కడప, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు మరోసారి ప్రజలను నివ్వెర పర్చేలా చేశాయి. ఆంధ్రప్రదేశ్ లో రెండు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగుతుండటంతో పోలీసులు కూడా అదుపు చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత కూడా ఇబ్బందిగా మారిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**ఘర్షణలు...**

ఆంధ్రప్రదేశ్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ నిన్న ప్రారంభమయినా పలుచోట్ల ఉద్రిక్తతలు, ఘర్షణల మధ్య హింసాత్మకంగా ప్రారంభమైంది. అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య పలు జిల్లాల్లో తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో హింస జరుగుతోందంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు నిన్న కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైతే నామినేషన్ల గడువును 48 గంటల పాటు పొడిగించేలా నిర్ణయం తీసుకోవాలని ఏపీ ఎన్నికల సంఘానికి సూచించింది. అభ్యర్థులు నేరుగా జిల్లా కలెక్టర్ల వద్ద కూడా నామినేషన్లు సమర్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది.ఈ గొడవల నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితా విడుదలను కోర్టు అక్టోబర్ 25 వరకు పొడిగించింది.

# విపత్తులను తప్పించలేం

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః** ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా ధర్మానా..?

# అసలు నీకు అర్థమయ్యాయా..?

**అమరావతి, అక్టోబర్ 22(మనంప్రతినిధి):** సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం మాదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో తానే అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా? అవి నీకు అర్థమయ్యాయా? అని ప్రశ్నించారు. తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని, ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు.



2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో మీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్కుమార్ ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ పార్టీ, మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు.

# గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

(మొదటి పేజీ తరువాయి)

మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య సూచించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై రాష్ట్రంలోని ప్రముఖ బేవరేజ్ సంస్థల ప్రతినిధులతో గురువారం విజయవాడలోని ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయం నుంచి ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, వివిధ బేవరేజ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయాలపై ప్రత్యేక దృష్టి....**

గోదావరి పుష్కరాలు కుంభమేళా తరహాలో భారీ స్థాయిలో నిర్వహించనున్న నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరి తీర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉందని, ఈ సమయంలో తాగునీరు, పానీయాల సరఫరా ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేందుకు సాధ్యమైన మేరకు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా వృక్షాధారిత పదార్థాలు, పేపర్ వంటి వాటితో రూపొందించిన పర్యావరణహిత సీసాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ విధానాల వినియోగంపై పరిశ్రమలు పరిశీలన చేయాలని కోరారు.

**తాగునీరు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు...**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్లాస్టిక్ సీసాలకు బదులు అవసరమైన ప్రాంతాల్లో వాటర్ డిస్పెన్సర్లు ఏర్పాటు చేయడం, పునర్వినియోగానికి అనువైన సీసాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని బేవరేజ్ సంస్థలకు సూచించారు.పరిశ్రమలు తమ వనరులు, సామర్థ్యానికి అనుగుణంగా పుష్కర ప్రాంతాల్లో తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరా కోసం స్థానిక యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

**ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ, రీసైక్లింగ్కు పటిష్టమైన వ్యవస్థ...**

పుష్కరాల సమయంలో విక్రయించే లేదా పంపిణీ చేసే ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగం అనంతరం నిర్లక్ష్యంగా పడవేయకుండా, వాటిని సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసే వ్యవస్థను ముందుగానే సిద్ధం చేసుకోవాలని డా. పి. కృష్ణయ్య సూచించారు.బాటిళ్ల సేకరణ కోసం తగిన కేంద్రాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాలను ఇతర చెత్త నుంచి వేరు చేయడం, సేకరించిన బాటిళ్లను అధీకృత రీసైక్లింగ్ సంస్థలకు తరలించడం, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగించడం వంటి చర్యలపై దృష్టి సారించాలన్నారు. పుష్కర ప్రాంతాల్లో స్థానిక సంస్థలు, పారిశుధ్య సిబ్బంది, బేవరేజ్ కంపెనీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేవలం బాటిళ్లను సేకరించడంతో ముగియకూడదని, వాటిని సరైన విధానంలో రీసైక్లింగ్ చేయించే వరకు బాధ్యతాయుతమైన వ్యవస్థ ఉండాలని ఛైర్మన్ పేర్కొన్నారు. అలానే పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం, సేకరణ, రీసైక్లింగ్ వివరాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించడం అవసరమని ఛైర్మన్ స్పష్టం చేశారు. పుష్కరాల కోసం ఎన్ని ప్లాస్టిక్ బాటిళ్లు అమ్ముడయ్యాయి, ఎన్ని ఉచితంగా పంపిణీ అయ్యాయి, వాటిలో ఎన్ని తిరిగి సేకరించబడ్డాయి, ఎంత పరిమాణంలో రీసైక్లింగ్కు పంపించారు, ఇంకా ఎంత వ్యర్థం మిగిలిపోయింది అనే వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న హిందుస్థాన్ కోకా-కోలా, రిలయన్స్, బిస్లెరీ ఇంటర్నేషనల్, ఆర్టోస్ తదితర సంస్థల ప్రతినిధులు. వాటర్ డిస్పెన్సర్ల ఏర్పాటు, తాగునీరు మరియు పానీయాల సరఫరా, ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ, రీసైక్లింగ్ వంటి అంశాలపై వివిధ ప్రతిపాదనలు చర్చించారు. పుష్కరాల సందర్భంగా తమ సంస్థల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలు, అందించగల సహకారం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు అనుసరించనున్న విధానాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను పదిహేను రోజుల్లోగా సమర్పించాలని ఆయా సంస్థల ప్రతినిధులను ఛైర్మన్ కోరారు. గోదావరి పుష్కరాలను పర్యావరణహితంగా నిర్వహించడంలో ప్రభుత్వ శాఖలతో పాటు పరిశ్రమలు, స్థానిక సంస్థలు, ఇతర భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు, గోదావరి నది, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య పేర్కొన్నారు.

# జనవరి 1 నుంచి సిమ్ బైండింగ్ రూల్స్

**హైదరాబాద్, అక్టోబర్ 22 :** వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్స్ కు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స్ ఫోన్లో పనిచేయవన్నమాట. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా సంబంధిత ప్లాట్ ఫారమ్ రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించే లైవ్ సిమ్ములతో ఖాతాలను అనుసంధానించాలని టెలికాం విభాగంమార్గదర్శకాలు జారీ చేసింది. మొబైల్ నంబర్లను ఉపయోగించి చేసే సైబర్ నేరాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిబంధనలు కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి నుంచే ఈ రూల్స్ను అమలు చేయాల్సి ఉండగా.. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించింది.




సిమ్ బైండింగ్ నిబంధనల ప్రకారం.. సిమ్ కార్డు లేకపోయిన లేదా సిమ్ తొలగించినా వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి కమ్యూనికేషన్ యాప్ సేవలు ఆటోమేటిక్ గా ఆగిపోతాయి. ప్రస్తుతం యాప్ ఇన్ స్టలేషన్ సమయంలోనే సిమ్కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్ ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**ఎవరిపై ప్రభావం?**

ఎవరైనా సిమ్ లేకుండా వాట్సప్ వాడుతుంటే ఆ ఫోన్లలో కొత్త నిబంధనల ప్రకారం యాప్ సేవలు నిలిచిపోతాయి. ఒకే యాప్ ను వేర్వేరు డివైజుల్లో వాడుతున్నప్పుడూ ప్రైమరీ డివైజులు కాకుండా మిగిలిన వాటిలో సేవలు నిలిచిపోతాయి. వాస్తవానికి వెబ్ లాగిన్ ను ఆరు గంటలకోసారి లాగౌట్ అయ్యేలా తొలుత నిబంధన తెచ్చినప్పటికీ.. తర్వాత ఆ నిబంధనను తొలగించారు. రిస్క్ బేస్డ్ లాగౌట్ విధానాన్ని డాట్ తీసుకొచ్చింది.

# ప్రైవేటు బడుల్లో పేదలకు 25 శాతం సీట్లు

## తెలంగాణ విషయంలో సుప్రీం కోర్టు ఆగ్రహం

**ఢిల్లీ, అక్టోబర్ 22 :** రాష్ట్రంలోని నిరుపేద వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించే వ్యవహారంలో ముందడుగు పడుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా పలు రాష్ట్రాలు ఇప్పటికీ అమలు చేయకపోవడంపై ఇటీవల జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్సీపీసీఆర్)పై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరిగే విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.



ఈ నేపథ్యంలో ఎన్సీపీసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా.. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఢిల్లీ వెళ్లి.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తామంటూ ఆ సంఘానికి హామీ ఇచ్చారు.

**చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నా..**

విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలి. దీని అమలుపై ఈ ఏడాది జనవరిలో సుప్రీం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేకంగా పోర్టల్ ప్రారంభించాలని, ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించాలని, లాటరీ విధానంలో సీట్లు కేటాయించాలని, సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్ను ప్రారంభించాలని.. ఇలా పలు నిబంధనలను విధించింది. అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఎన్సీపీసీఆర్కు అప్పగించింది. యూపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, హరియాణా, తమిళనాడు తదితర రాష్ట్రాలు విధివిధినాలు రూపొందించుకొని అమలు చేస్తున్నాయి.

**గత ఏడాది తూతూమంత్రంగా..**

తెలంగాణలో ఈ చట్టం అమలుపై హైకోర్టులో గత ఏడాదే పిటిషన్ దాఖలు కాగా.. అమలు చేస్తామంటూ విద్యాశాఖ న్యాయస్థానంలో అంగీకరించింది. ప్రభుత్వ బడులు అందుబాటులో లేని 96 ఆవాసాల్లో పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించేలా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా 2025 జులైలో ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కేవలం డీఈవోలకు ఉత్తర్వులు పంపి ఊరుకున్నారు. ఫలితంగా 2025-26, 2026-27 విద్యాసంవత్సరాల్లో 180 మంది మాత్రమే ప్రవేశాలు పొందినట్లు విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీం దృష్టిసారించిన నేపథ్యంలో దీని అమలుపై అధికారులు మళ్లీ కసరత్తు ఆరంభించారు.

# ఎన్నికలు... రీ షెడ్యూల్

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అనుగుణంగా ఎస్ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.

**నామినేషన్లకు మళ్లీ అవకాశం...**

అభ్యర్థులకు నామినేషన్లు వేయడంలో ఇబ్బందులు ఎదురైనట్లు గుర్తించిన నాలుగు ప్రధాన పట్టణ స్థానిక సంస్థలలో నామినేషన్ల గడువును 48 గంటల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రకారం కడప మున్సిపల్ కార్పొరేషన్లో కొన్ని నిర్దిష్ట వార్డులతో పాటు, రాజంపేట మున్సిపాలిటీ, మైదుకూరు మున్సిపాలిటీ , తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లోని పలు వార్డులకు సంబంధించి అక్టోబర్ 23 , 24 తేదీలలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. గతంలో నిర్ణయించిన కేంద్రాలతో పాటు కలెక్టరేట్ ప్రాంగణాల్లోనూ ఈ నామినేషన్లను దాఖలు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

**ఎన్నికల పూర్తి షెడ్యూల్ వివరాలు..**

కొత్తగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పత్రాల పరిశీలన అక్టోబర్ 25న ఉదయం 8:00 గంటల నుండి ప్రారంభమవుతుంది. అదే రోజు మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తర్వాత అదే రోజు మధ్యాహ్నం 3:00 గంటల తరువాత తుది అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న ఉదయం 7:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఒకవేళ ఎక్కడైనా రీ-పోలింగ్ అవసరమైతే నవంబర్ 2న నిర్వహించి, నవంబర్ 3న ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. మున్సిపల్ ఎన్నికల తేదీలు మారిన నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తేదీలపై కూడా త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




# జిల్లా పరిషత్‌లో ఎంసిఎంసి ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్



అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 22 : మనం న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కోసం మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ , ఎంసిఎంసీ ) ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. స్థానిక సంస్థల ( జడ్పిటిసి, ఎంపిటిసి) ఎన్నికలకు సంబంధించి టీవీ ఛానెళ్లు / కేబుల్ నెట్వర్క్ / రేడియో / సినిమా హాళ్లు / బహిరంగ ప్రదేశాలలో ఆడియో విజువల్ డిస్ప్లేలు / ఈ-పేపర్లు / బల్క్ ఖిఖిలు / వాయిస్ మెసేజ్లు / సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనల ధృవీకరణ, 'పెయిడ్ న్యూస్' పరిశీలన మరియు పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ కమిటీ చైర్మన్ గా, కమిటీ సభ్యులుగా జిల్లా ప్రజా పరిషత్ సిఈఓ పి.విజయలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ.బాలకొండయ్య సభ్యులుగా మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

**జిల్లా పరిషత్ లో ఎంసిఎంసి ఏర్పాటు..:**

అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ లోని ప్లానింగ్ సెక్షన్ ఎదురుగా ఉన్న గదిలో మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ , ఎంసీఎంసీ ) ఏర్పాటు చేయడం జరిగింది.

ఏదైనా గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ లేదా వ్యక్తిగత అభ్యర్థి ద్వారా ఏదైనా రాజకీయ ప్రకటన యొక్క ధృవీకరణ కోసం దరఖాస్తును, అటువంటి ప్రకటన యొక్క టెలికాస్ట్ / ప్రసారం / ప్రదర్శన ప్రారంభమయ్యే తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నియమించబడిన కమిటీకి సమర్పించాలి.

అటువంటి ప్రతి దరఖాస్తు అనెక్సర్-ఎ ( అనెక్సర్ - ఏ) లో సూచించిన ఫార్మాట్లో ఉండాలి. ప్రతిపాదిత ప్రకటన యొక్క ఎల్రక్టానిక్ రూపంలో రెండు కాపీలు, దానితో పాటు సక్రమంగా ధృవీకరించబడిన ప్రతిలేఖనం(ట్రాన్స్క్రిప్షన్) తదితర వివరాలతో సమర్పించాల్సి ఉంటుంది. పెయిడ్ న్యూస్ కొరకు జిల్లా స్థాయి ఎంసిఎంసీ పర్యవేక్షిస్తుంది.

# కత్తిపూడి జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం..

## నలుగురు భవానీ భక్తులు మృతి!

## భవానీ భక్తుల కుటుంబాల్లో తీవ్ర విషాదం..



శంఖవరం అక్టోబర్ 22 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి సమీపంలోని రావికంపాడు రోడ్డు కూడలి వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కార్పియో కారు ఢీకొనడంతో విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతానికి చెందిన నలుగురు భవానీ భక్తులు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతం నుంచి సుమారు 40 మంది భవానీ భక్తులు ప్రైవేట్ బస్సులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. కత్తిపూడి సమీపంలో బస్సు సాంకేతిక లోపంతో ఆగిపోవడంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో కొందరు భక్తులు టీ తాగేందుకు, ఇతర అవసరాల కోసం బస్సు దిగారు. ఈ క్రమంలో రహదారిని దాటుతున్న భక్తులపైకి వేగంగా వచ్చిన స్కార్పియో కారు దూసుకెళ్లింది.

ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో భక్తుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు. మృతులను డెంకాడకు చెందిన సిరిగిడి ఎర్రయ్య (38), లింగాల సీతారాం (45), బొనేల సత్తిబాబు (40), తాటిపూడి శివప్రసాద్ (40)గా పోలీసులు గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న కాకినాడ డీఎస్పీ తిలక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో భవానీ భక్తుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దర్యాప్తులో భాగంగా ప్రతిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు, అన్నవరం సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ హరి బాబు, అన్నవరం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## యు. కొత్తపల్లి మండలంలో 56 ఎంపీటీసీ నామినేషన్లలు

యు. కొత్తపల్లి సెప్టెంబర్ 22 (మనం న్యూస్): మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా గురువారం నాటికి మొత్తం 56 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని 24 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.

నామినేషన్ల వివరాల ప్రకారం వైఎస్సార్సీపీ నుంచి అత్యధికంగా 26 నామినేషన్లు దాఖలు కాగా, తెలుగుదేశం పార్టీ నుంచి 18, జనసేన పార్టీ నుంచి 9, స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నుంచి ఒక నామినేషన్ దాఖలైంది.స్థానాల వారీగా చూస్తే వాకతిప్ప ఎంపీటీసీ స్థానానికి అత్యధికంగా ఆరు నామినేషన్లు వచ్చాయి. ఎండపల్లి-2 స్థానానికి ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇసుకపల్లి, నాగులపల్లి-1, ఉప్పాడ-2 స్థానాలకు నాలుగు చొప్పున నామినేషన్లు వచ్చాయి. కొమరగిరి, కొత్తపల్లి, ములపేట-1, ములపేట-2, పొన్నాడ-2, ఉప్పాడ-3, ఉప్పాడ-4 స్థానాలకు మూడు చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.

మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

# నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా సంయుక్త కలెక్టర్



అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 22(మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికలు - 2026 కు సంబంధించి పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీస్ బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ సమస్యలు, తదితర వివరాలను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమయానికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి భద్రత సమస్యలు రాకుండా చూడాలన్నారు.

నామినేషన్ల చివరి రోజు చివరి సమయంలో ఇబ్బందులు రాకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆర్ఓ, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, ఎంపీడీవో పెద్దపప్పూరు, డిఎం మార్క్ఫెడ్ మరియు ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల విజయం కోసం పని చేయండి

- వైభవ్ రెసిడెన్సీలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్



అనంతపురం, అక్టోబర్ 22 మనం న్యూస్ : నగరంలోని వైభవ్ రెసిడెన్సీలో ఎస్ఆర్ లోకేష్ బాబు ఆధ్వర్యంలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రితోపాటు నగరపాలక సంస్థ బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ఆర్ నాగభూషణం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చక్రధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానికంగా కూడా ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే నిధులు సమకూర్చుకుని నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. వైసీపీకి ఓటు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. నగరంలో అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలంటే కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీసీ నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే అనంతపురం నగరం మళ్లీ వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొత్తంగా అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. అనంతరం ఎస్ఆర్ నాగభూషణం మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి విజయం సాధిస్తేనే అనంతపురం నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. కావున బీసీ నాయకులంతా మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్తోపాటు కార్పొరేటర్ల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

## వసుంధరదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ బీకే దంపతులు



హిందూపురం (మనం న్యూస్), అక్టోబర్ 22: హిందూపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్ కుమార్ కుమారుడు పవన్ రక్షిత వివాహ వేడుక గురువారం పట్టణంలోని ఆర్ఎంఎస్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బి.కె. పార్థసారథి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుక సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖుల రాకతో వివాహ వేడుక సందడిగా సాగింది. అనంతరం హిందూపురం పట్టణంలోని బాలాజీ నివాసంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవిని ఎంపీ బి.కె. పార్థసారథి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా ఇదే రోజు ఎంపీ తనయుడు సుధాకర్ మనుమడి నామకరణ మహోత్సవానికి ఎంపీ బి.కె. పార్థసారథి, కమలమ్మ దంపతులు హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో హిందూపురం మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థి పి.ఎస్. మంజునాథ్, నాగరాజు, మంచాల మారుతి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించండి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు



రాయదుర్గం, అక్టోబరు 22, మనం న్యూస్: రాయదుర్గం పురపాలక సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఎన్నికల బరిలో నిలుస్తున్నాయని స్పష్టం చేశారు.మూడు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు పురపాలక ఎన్నికల్లో జనసేనకు మూడు, భారతీయ జనతా పార్టీకి రెండు వార్డులను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ తరపున 9వ వార్డులో నాగరత్నమ్మ, 37వ వార్డులో భాగ్యమ్మ పోటీ చేస్తున్నారని వెల్లడించారు. జనసేన తరపున కూడా ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుస్తారని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ అభ్యర్థులతోపాటు కూటమి భాగస్వామ్య పార్టీలైన భారతీయ జనతా పార్టీ, జనసేన అభ్యర్థులను సైతం అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కూటమి ఐక్యతను చాటుతూ అన్ని వార్డుల్లోనూ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు అందిస్తోందని, వాటి ద్వారా వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని కాలవ శ్రీనివాసులు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి పార్టీల మధ్య ఉన్న ఐక్యతను పురపాలక ఎన్నికల్లోనూ ప్రతిబింబించాలని, ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి అఖండ విజయాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, భారతీయ జనతా పార్టీ నాయకురాలు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీటీసీ నామినేషన్లకు పటిష్ఠ భద్రత

## డ్రోన్లు, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా

యు.కొత్తపల్లి సెప్టెంబర్ 22 (మనం న్యూస్): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్ గురువారం తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇందులో భాగంగా డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ఎంపీడీవో కార్యాలయం. కరెంట్ ఆఫీస్ , ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ తరపున తగిన చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు .

# వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరిన పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు



కిర్లంపూడి అక్టోబర్ 22:( మనం న్యూస్ ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానని వైఎస్సార్సీపీ నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు. జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ తోట నరసింహం, తోట రాంజీల ఆధ్వర్యంలో గోురువారం తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో తన సతీమణి శ్రీదేవి, ముఖ్య అనుచరులతో కలిసి ఆయన వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాటంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలు, మండలాల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల విజయానికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచిస్తోందని తీవ్రంగా విమర్శించారు. మళ్లీ ఎన్నికలు రాగానే గ్రామాల్లోకి వచ్చి పనులు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్న కూటమి నేతల ప్రకటనలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో గడపగడపకూ అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మండల పరిషత్ ఎన్నికలకు 35 నామినేషన్లు దాఖలు



ఏలేశ్వరం,అక్టోబర్ 22(మనం న్యూస్): ఏలేశ్వరం మండల పరిషత్ ఎన్నికలకు వివిధ పార్టీల నుండి ఎంపిటీసీ స్థానాలకు 35 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి సిరిల్ వెల్లడించారు. మండల పరిషత్ ఎన్నికల ప్రకృతిలో భాగంగా నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై రెండు రోజునాటికి 35 నామినేషన్లు దాఖలు అయ్యాయి వీటిలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీలు 15 మంది కాగా వైసీపీకి 16 నామినేషన్లు, జనసేన3, ఇండిపెండెంట్ 1 చొప్పున మొత్తం 35 నామినేషన్ దాఖలు అయ్యాయి.నామినేషన్లకు ఒక్క రోజు గడివే మిగిలి ఉంది.అయితే జడ్పిటిసి స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

## ఆరు వేళ్లు

అమ్మ చివరిసారి
శ్వాస పీలుస్తూ నిద్రలో విశ్రాంతి పొందుతున్న వేళ
నడిచిన పాద ముద్రలను వెతికాను..
అందరి అమ్మల కాళ్లకు ఐదు వేళ్లైతే
మా అమ్మకు ఆరు వేళ్లు..
కాలుతున్న వెన్నుముక వెంట
రాత్రులు కాపలా కాశాను
నీలో కదులుతున్న చివరి వాక్యాన్ని నీ పెదాల
కదలికల వెంట జారుతున్నపుడు
అందుకోలేక పోయాను

మన ఇంటి వాకిట్లో నీ తెల్లటి ముగ్గులో
కదులుతున్న నీ చేతి ముని వేళ్ళను చూశాను తల్లీ
నా నుదుటి మీద వొణుకు తున్న
చేతులతో స్పృశించిననీ చల్లటి
స్పర్శ ఇంకా నాలో కదులుతుంది

నీకు కావలసిన ఆక్సిజన్ అందించలేకపోయాను
ముడుచుకుంటున్న ఊపిరి తిత్తుల నిండా
కదలని శ్వాసలో కలవరింతలు విన్నాను
బతకాలనే ఆరాటంలో
లోపల కదులుతున్న మృత్యునావ
తిరగబడుతున్నదని
నీకు తెలుసు
స్పర్శ కోల్పోతున్న దేహానికి
వొక.. పోరాటాన్ని అంకితం చేశావు
ప్రతి పూల పండుగకు నిన్ను
వెతుక్కుంటూ నేనొస్తాను
తలుపులు తెరిచిన ఇంట్లో
నువ్వు ఎదురుచూస్తుంటావని..

చీకటిని తరమడానికి నువ్వెలిగించిన
దీపం వెలుగుతూనే ఉంది
నీకిష్టమైన మందారపువ్వు
నువ్వొస్తావని ఎదురుచూస్తుంది
నీతో ముచ్చటించాలని
నీ వెంట తిరగాలని తుల్య
మాటలను స్కూల్ బ్యాగ్‌లో సర్దుకుని వచ్చింది..
ఈ నవరాత్రుల వేళ...బతుకమ్మవై...
బతికిరామ్మా

- ఎం.వి.రమణ
9989000265

# యూరప్ ఆందోళనలనకు కారణాలేమిటి?





ఒకప్పుడు ప్రపంచానికి ప్రజాస్వామ్య విలువలను,సంక్షేమరాజ్య భావనను, నాణ్యమైన విద్యను, సామాజిక భద్రతను పరిచయం చేసిన యూరప్ ఇప్పుడు ఆందోళనలతో అట్టుడు కుతోంది. ఫ్రాన్స్‌లో పాఠశాలల దుస్థితి, ఉపాధ్యాయుల కొరతపై మొదలైన నిరసనలు జీవన వ్యయానికి వ్యతిరేకంగా విస్తరిస్తుంటే, స్పెయిన్, పోర్చుగల్లో గృహ సంక్షోభం ప్రజలను వీధుల్లోకి తీసుకొస్తోంది. ఇటలీలో ధరల పెరుగుదల, తక్కువ వేతనాలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. బెల్జియంలో ప్రభుత్వ పొదుపు చర్యలు, విద్యారంగ సమస్యలు నిరసనలకు కారణమవుతున్నాయి. కొన్నిచోట్ల ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్నాయి.

ఒక దేశంలో నిరసనలు జరిగితే అక్కడి ప్రభుత్వ విధానాలను తప్పుపట్టవచ్చు. కానీ, అనేక దేశాల్లో ఒకే సమయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం యాదృచ్ఛికం కాదు. ఇవి వ్యక్తిగత పాలకుల వైఫల్యాలకే పరిమితమైన సమస్యలు కావు. యూరప్ ఆర్థిక నమూనా, సంక్షేమ రాజ్య భవిష్యత్తు, తరాల మధ్య పెరుగుతున్న అసమానతలు, ప్రజాస్వామ్యంపై ప్రజలకు తగ్గుతున్న విశ్వాసం వంటి లోతైన పరిణామాలకు సంకేతాలు. అసలు ఈ అసంతృప్తి మూలాలు ఎక్కడున్నాయి?

ప్రస్తుతం యూరప్‌ను కుదిపేస్తున్న ప్రధాన సమస్య జీవన వ్యయం. ఆహారం, ఇంధనం, విద్యుత్తు, అద్దెల ధరలు పెరుగుతున్నా, వేతనాలు అదే స్థాయిలో పెరగడం లేదు. ఫలితంగా ఉద్యోగం చేస్తున్నవారు సైతం ఆర్థిక అభద్రతను ఎదుర్కొంటున్నారు. నెలవారీ ఆదాయంలో అధికభాగం ఇంటి అద్దెకే ఖర్చవుతుంటే, విద్య, వైద్యం, ఇతర అవసరాలకు డబ్బు మిగలడం లేదు.

సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. స్పెయిన్‌లోనూ గృహసంక్షోభం యువతను నిరసనల వైపు నడిపి స్తోంది. మరోవైపు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాలో అంతరాయాలు ధరల ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. అంటే, ప్రజల ఆగ్రహానికి తక్షణ కారణాలు దేశీయమైనప్పటికీ, వాటిని తీవ్రతరం చేస్తున్న శక్తుల్లో అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలూ ఉన్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత యూరప్ దేశాలు సంక్షేమ రాజ్య నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చాయి. ప్రభుత్వ విద్య, ప్రజారోగ్యం, నిరుద్యోగ భృతి, కార్మిక హక్కులు, పింఛన్లు ప్రజలకు సామాజిక భద్రత కల్పించాయి. మార్కెట్ ఆర్థిక వ్యవస్థలోని అసమానతలను కొంతవరకు తగ్గించాయి.

అయితే, ప్రపంచీకరణ, ఆర్థిక పోటీ, జనాభా వృద్ధాప్యం, ప్రభుత్వాలపై పెరుగుతున్న అప్పుల భారం ఈ నమూనాకు సవాళ్లు విసురుతున్నాయి. బడ్జెట్ లోటును తగ్గించాలనే పేరుతో ప్రభుత్వాలు ఖర్చులను కుదించినప్పుడు, దానిప్రభావం తరచుగా విద్య,వైద్యం, ప్రజారవాణా వంటి సేవలపై పడుతోంది.

బెల్జియంలో ప్రభుత్వ బడ్జెట్ కోతలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టడం ఈ సంఘర్షణకు ఉదాహరణ. ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ ఒకవైపు అవసరమే. కానీ దాని భారాన్ని కార్మికులు, పెన్షనర్లు, తక్కువ ఆదాయ వర్గాలే మోయాల్సి వస్తే సంక్షేమ రాజ్యంపై విశ్వాసం దెబ్బతింటుంది.

**విద్యారంగం క్షీణిస్తే భవిష్యత్తు ఏమవుతుంది?**

విద్య అనేది కేవలం ప్రభుత్వ వ్యయంలో ఒక అంశం కాదు. సమాజ భవిష్యత్తుకు పునాది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత,విద్యార్థుల సంఖ్య మరీ ఎక్కువగా ఉండడం, వసతుల లేమి, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు యువత భవిష్యత్తుపై అనిశ్చితిని పెంచుతున్నాయి.

ఫ్రాన్స్‌లోపాఠశాలల వనరులు, సిబ్బంది కొరతపై మొదలైన నిరసనలు క్రమంగా జీవన వ్యయం, ప్రభుత్వ సేవలపై అసంతృప్తితో కలిశాయి. స్పెయిన్‌లో ఉపాధ్యాయుల మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కోసం ఉద్యమిస్తున్నారు.

చదువుకుంటే ఉద్యోగం వస్తుందనే నమ్మకం బలహీన పడినప్పుడు యువతలో నిరాశ పెరుగుతుంది. విద్యార్హతలు పెరిగినా స్థిరమైన ఉపాధి, సొంతఇల్లు, మెరుగైన జీవితం అందక పోతే వ్యవస్థ తమకు అవకాశాలు కల్పించడం లేదనే భావన ఏర్పడుతుంది. ఈ నిరాశే నిరసనలకు ఇంధనంగా మారుతోంది.

**చరిత్ర పాఠాలు.. వర్తమాన హెచ్చరికలు**

యూరప్‌లో ప్రజాఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1789 ఫ్రెంచ్ విప్లవం సామాజిక అసమానతలు, ఆర్థిక సంక్షోభం, పాలకవర్గాల ప్రత్యేక హక్కులకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడిన చారిత్రక ఘట్టం. 1848 నాటి యూరోపియన్ విప్లవాలు రాజకీయ హక్కులు, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం సాగాయి. 1968లో ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఉద్యమం కార్మిక సమ్మెలతో కలసి విస్తృత సామాజిక మార్పుల చర్చకు దారితీసింది.

ఈ చరిత్రను ప్రస్తుత నిరసనలతో సమానంగా చూడలేం. అయినప్పటికీ, ఒక విషయం స్పష్టమవుతుంది. ఆర్థిక ఇబ్బందులు రాజకీయ అసంతృప్తితో కలిసినప్పుడు చిన్న సమస్య కూడా పెద్ద ఉద్యమానికి నాంది కావచ్చు.

ప్రస్తుత పరిస్థితుల్లో మరో ప్రమాదం ఉంది. ప్రజల అసంతృప్తిని పరిష్కరించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమైతే, వలసదారులను లేదా ఇతర బలహీన వర్గాలను సమస్యలకు కారణంగా చూపే అతివాద రాజకీయ శక్తులు బలపడవచ్చు. అసలు కారణాలపై చర్చ జరగకుండా ప్రజల ఆగ్రహం ఇతరులపైకి మళ్లే ప్రమాదం ఉంది.

అయితే, అన్ని దేశాల్లోనూ సమస్యలు ఒకేలా లేవు. ఒకచోట విద్యారంగం, మరొకచోట గృహ సంక్షోభం, ఇంకొక చోట ప్రభుత్వ పొదుపు చర్యలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. స్థానిక సమస్యలు వేర్వేరైనా, వాటి వెనుక ఉన్న ఉమ్మడి ప్రశ్న ఒక్కటే. ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయి?

ప్రభుత్వాలు హింసను అరికట్టడం అవసరమే. ప్రజా ఆస్తుల విధ్వంసాన్ని సమర్థించేవారెవరూ ఉండరు. కానీ హింసాత్మక ఘటనలనే మొత్తం ఉద్యమానికి ప్రతిరూపంగా చూపించి, నిరసనలకు దారితీసిన అసలు సమస్యలను విస్మరించడం పరిష్కారం కాదు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటులో గృహాలు, గౌరవప్రదమైన వేతనాలు, మెరుగైన ప్రజాసేవలు, పారదర్శక పాలనకు ప్రాధాన్యమివ్వాలి. యూరప్ వీధుల్లో వినిపిస్తున్న నినాదాలు కేవలం ధరల తగ్గింపు కోసం చేస్తున్న డిమాండ్లు కావు. అవి తమ భవిష్యత్తుపై ప్రజలు సంధిస్తున్న ప్రశ్నలు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి ఆకాంక్షలకు భరోసా కల్పించడం లాంటి ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పలేకపోతే, నేటి నిరసనలు క్రమంగా రాజకీయ ప్రకంపనలుగా మారనుండడాన్ని రేపటి రోజున మనం చూడబోతున్నాము.

- గుండెబోయిన శ్రీనివాస్
9985194697

# మాటలు వద్దు.. ప్రాతినిధ్యం కావాలి






తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు ఇచ్చిన హామీలు, వాటికి అనుగుణంగా లభిస్తున్న రాజకీయ ప్రాతినిధ్యం మరోసారి చర్చకు రావాల్సిన సమయం ఇది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు, నవంబర్‌లో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు, ఖైరతాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు రాజకీయ అవకాశాల ప్రశ్న ముందుకు వచ్చింది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టినప్పటికీ, న్యాయపరమైన సవాళ్ల కారణంగా ఆ హామీ పూర్తి స్థాయిలో అమలు కాలేకపోయింది. ఆ హామీ అమలు కోసం ప్రభుత్వం అవసరమైనంత చిత్త శుద్ధితో, రాజకీయ పట్టుదలతో కృషి చేయలేదనే విమర్శ వస్తోంది. జనాభాలో పెద్ద భాగంగా ఉన్న బీసీలకు సాధారణ రాజకీయ స్థానాల్లో కూడా తగిన భాగస్వామ్యం ఉండాలి.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ప్రశ్నకు రాజకీయంగా సమాధానం చెప్పాల్సినబాధ్యత కాంగ్రెస్‌పై.. ముఖ్యంగా ముఖ్యమంత్రిపై ఉంది. బీసీలకు కీలక శాఖలు అప్పగించడం ద్వారా పాలనలో నిర్ణయాత్మక భాగస్వామ్యం కల్పించవచ్చు. విద్య,నిధుల కేటాయింపు, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ-సాంస్కృతిక రంగాల్లో బీసీల భాగస్వామ్యానికి సంబంధించిన ప్రశ్న. బీసీ ప్రజాప్రతినిధిత్వం అంటే బీసీ వ్యక్తి పదవిలో ఉండటం మాత్రమే కాదు. ఆ పదవిని బీసీల హక్కుల కోసం ఉపయోగించడం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన యువతకు అవకాశాల ప్రశ్న కూడా ఇదే సందర్భంలో చూడాలి. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైనవారు, ప్రజా సమస్యలపై పోరాడినవారు, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసినవారు, ప్రజల్లో పనిచేస్తున్న కొత్త నాయకత్వానికి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, ఇతర రాజకీయ అవకాశాల్లో తగిన స్థానం కల్పించాలి. యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రస్తావించారు. ఈ ఆలోచనలు ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన కష్టపడే యువతకు అవకాశాలు కల్పించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభ దశలో నామినేటెడ్ పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికే అధిక ప్రాధాన్యం లభించిందనే విమర్శ ఉంది. తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు అవకాశాలు కల్పించినప్పటికీ, ప్రారంభ దశలో ఏర్పడిన అసమతుల్యతపై పార్టీ స్వయం పరిశీలన చేసుకోవాలి. అధికారంలోకి రావడానికి అన్ని సామాజిక వర్గాలూ పనిచేసినప్పుడు, అధికారంలో భాగస్వామ్యం కూడా అందుకు అనుగుణంగా ఉండాలి. ప్రజాసేవ, సామాజిక ఉద్యమాలు, ప్రజాసమస్యలపై పనిచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా నాయకత్వానికి అవకాశం కల్పించడం ద్వారా మరింత సామాజిక విలువ చేకూరుతుంది.

కాంగ్రెస్ తీసుకునే నిర్ణయమే అయినా, ఉన్న అవకాశాల్లోనే సామాజిక ప్రాతినిధ్యం కనిపించాలి. కొత్త పదవులు వచ్చినప్పుడు మాత్రమే సామాజిక న్యాయం గురించి మాట్లాడకుండా, మంత్రివర్గం, ఎమ్మెల్సీ స్థానాలు, పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, అభ్యర్థిత్వాలు-అన్ని అవకాశాల్లోనూ అది ప్రతిఫలించాలి. బీసీలకు ఇచ్చిన రాజకీయ హామీలను ఆచరణలోకి తీసుకురావడమే ఈ డిమాండ్ల సారాంశం. ప్రస్తుత పార్టీల్లోనే సామాజిక న్యాయం కోసం మరింత బలంగా డిమాండ్ చేయాలా, లేక తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత స్వతంత్రంగా నిర్మించుకోవాలా అనే ప్రశ్న ముందుకు రావచ్చు. అవసరమైతే ప్రస్తుత పార్టీలకు భిన్నంగా స్వతంత్ర ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి గురించి కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అందువల్ల బీసీలను, బడుగు వర్గాలను, కష్టపడే యువతను కేవలం ఓటర్లుగా చూస్తారా? లేక రాజకీయ అధికారంలో భాగస్వాములుగా గుర్తించి చేతల్లో చూపిస్తారా?

- పాపని నాగరాజు
9948872190

# వ్యంగ్య చిత్రకారులలో మేటి ఆర్. కె.లక్ష్మణ్

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించబడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష వూహాచిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం.

ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహవిగ్రహం ప్రతిష్ఠించారు. భారత దేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం.




ఆర్.కె.లక్ష్మణ్‌గా లబ్ధప్రతిష్టులైన రాశిపురం కృష్ణ స్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 - జనవరి 26,2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించబడే ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రతిరోజూ వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండేవారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి (Common Man) పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయరంగాన్ని సరైన పంథాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది. లక్ష్మన్ అంటే, రాజకీయ నాయకులందరికీ గౌరవం, అంతకుమించి ఎనలేని ప్రేమ. 2003లో తీవ్రఅస్వస్థులై ఆసుపత్రి పాలైనప్పుడు, దేశంలోని హేమాహేమీలందరూ ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆదుర్దాతో తెలుసు కోవడమే కీఆకుండా,మాజీ ఉపరాష్ట్రపతి భైరవ్ సింగ్ షేకావత్ తో సహా చాలా మంది ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.

ఆర్కే లక్ష్మణ్ మైసూర్ నగరంలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తండ్రి పాఠశాల ప్రధానోపాధ్యయులు. లక్ష్మణ్ ఆరుగురు సంతానంలో చిన్నవాడు. ఆయన అన్నలలో ఒకరైన ఆర్.కె. నారాయణ్ మాల్గుడి డేస్ కథలు రచించిన ప్రముఖ ఆంగ్ల రచయిత కావడం యాదృచ్ఛికం. చిన్నతన నుండి లక్ష్మణ్‌కు బొమ్మల పుస్తకాలు చూసే అలవాటు ఉండేది. ఆంగ్ల పత్రికలైన స్ట్రాండ్ (Strand), పంచ్ (Punch), బైస్టాండర్ (Bystander), వైడ్-వరల్ (Wide World), టిట్ బిట్స్ (Tit Bits) వంటి బొమ్మల కార్టూన్ పుస్తకాలను, తాను చదవటం నేర్వకముందే చూసేవాడు. బొమ్మల పుస్తకాలు చూస్తూ, మెల్లిగా గీతలు గీస్తూ బొమ్మలు వెయ్యటం మొదలు పెట్టారు. నేల మీద, గోడల మీద, తలుపుల మీద, ఎక్కడ పడితే అక్కడ రకరకాల బొమ్మలు వేసేవారు. తన ఉపాధ్యాయులనూ వదలక వాటి చిత్రాలుకూడ వేసారు. తాను వేసిన బోధి వృక్షం ఆకు బొమ్మను టీచర్లు కూడా మెచ్చుకున్నప్పుడు తానొక చిత్రకారుడిగా తయారయ్యే అవకాశం ఉన్నదని భావించారు.

ఉన్నత పాఠశాల తరువాత, లక్ష్మణ్ బొంబాయి (ఇప్పటి ముంబాయి) లోని జె.జెఇన్స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్స్‌లో చేరి బొమ్మలు వేయటం నేరుకోవటానికి, తన దరఖాస్తు చేశారు. కాని, ఆ పాఠశాల ప్రధానఅధికారి, అటువంటి బొమ్మలు వేసేవాడు తమ స్కూలులో విద్యార్థిగా ఉండ తగడు అని చేర్చుకోలేదని చెపుతారు.

అయితే లక్ష్మణ్ ఆ తర్వాత అదే పాఠశాల... ఏ పాఠశాలలో బొమ్మలు వేయటం నేర్చుకోవటానికి ప్రవేశం లభించలేదో, దాని పక్కనే ఉన్న ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో కొన్ని దశాబ్దాల పాటు వారి కార్టూనిస్ట్‌గా ఉండి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవటం ఆయన అకుంఠిత దీక్షకు నిదర్శనం. చివరకు మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. చదివి పట్ట భద్రుడయి, చదువు కొనసాగిస్తూనే బొమ్మలు వేస్తూ, ఫ్రీలాన్స్ (స్వతంత్ర) చిత్రకారునిగా కొనసాగారు. ఆ కాలంలోనె 'స్వరాజ్య' అన్న పత్రికలో కార్టూన్లు వేశారు. అలాగే, నారద అనే కార్టూన్ సినిమాకు కూడా బొమ్మలు వేశారు.

**అక్టోబర్ 23...ఆర్. కె.లక్ష్మణ్ జయంతి**

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# చదువులో ముందడుగు.. అంతటా వెనుకడుగే!



ఒక అమ్మాయి అబ్బాయితో సమానంగా చదువుతోంది. పరీక్షల్లో ప్రతిభ చూపుతోంది. ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. అయినా ఉద్యోగం కోసం వెతికేటప్పుడు అవకాశాల కొరత, వేతనాల్లో వివక్ష, కుటుంబ బాధ్యతల భారం ఎదుర్కొంటోంది. ప్రతిభ ఉన్నా నాయకత్వ స్థానాలకు చేరడం కష్టమవుతోంది. రాజకీయాల్లోకి రావాలంటే ఆర్థిక వనరులు, సామాజిక మద్దతు, భద్రత వంటి సవాళ్లను అధిగమించాల్సి వస్తోంది. ఇదే భారతదేశంలో లింగ సమానత్వం ఎదుర్కొంటున్న అసలు వైరుధ్యం.

ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన ప్రపంచ లింగ అంతరాల సూచీ-2026లో 145 దేశాల్లో భారత్ 131వ స్థానంలో నిలవడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. దేశ స్కోరు 64.5 శాతంగా నమోదైంది. 2006 నుంచి ఇరవయ్యేళ్లలో కేవలం 4.3 శాతం పాయింట్ల పురోగతి మాత్రమే కనిపించింది. మహిళలకు విద్య అందించడం మొదటి మెట్టు మాత్రమే. ఆ విద్యను ఆర్థిక స్వాతంత్ర్యంగా, సమాన వేతనంగా, నిర్ణయాధికారంగా మార్చినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది.

ఈ సూచీ ఆర్థిక భాగస్వామ్యం, విద్యా సాధన, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారత అనే నాలుగు రంగాల్లో మహిళలు, పురుషుల మధ్య అంతరాన్ని కొలుస్తుంది. వంద శాతం స్కోరు అంటే సూచీలో కొలిచిన అంశాల్లో సమానత్వం సాధించినట్లు. ఇది మహిళల మొత్తం అభివృద్ధికి సంబంధించిన శాతం కాదు.

భారత్ విద్యలో 96.6 శాతం, ఆరోగ్యంలో 95.6 శాతం స్కోర్లు సాధించగా, ఆర్థిక భాగస్వామ్యంలో 41.2 శాతం, రాజకీయ సాధికారతలో 24.5 శాతం మాత్రమే నమోదయ్యాయి. ఈ గణాంకాలు విద్య, ఆరోగ్య రంగాల్లో పురోగతి ఉన్నప్పటికీ, ఉపాధి, నాయకత్వం, నిర్ణయాధికారంలో అంతరం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తున్నాయి. వయోజన అక్షరాస్యతలో సమానత్వ స్కోరు 82.5 శాతంగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 2.7 శాతం పాయింట్లు తగ్గినా,2006లోని 65.2 శాతంతో పోలిస్తే దీర్ఘ కాలిక పురోగతి నమోదైంది. అయితే విద్యలో ప్రవేశం పొందడం, చదువు పూర్తి చేయడం, అర్హతకు తగిన ఉద్యోగం పొందడం వేర్వేరు దశలు. సురక్షిత ప్రయాణం లేకపోవడం, నైపుణ్య శిక్షణ కొరత, పిల్లల సంరక్షణ బాధ్యతలు, వివాహం లేదా ప్రసవం తర్వాత ఉద్యోగం కొనసాగించేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవడం మహిళల ఉపాధిని ప్రభావితం చేయవచ్చు.

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి, సురక్షిత రవాణా, పిల్లల సంరక్షణ కేంద్రాలు, సమాన వేతనం, కార్యాలయాల్లో వేధింపుల నిరోధం, ప్రసూతి అనంతరం ఉద్యోగంలో కొనసాగేందుకు అనుకూల విధానాలు అవసరం. విద్యను



స్వతంత్ర జీవితానికి పునాదిగా మార్చే బాధ్యత ప్రభుత్వానిదే.

ఆర్థిక భాగస్వామ్య స్కోరు 41.2 శాతంగా ఉంది. 2025తో పోలిస్తే 0.5 శాతం పాయింట్లు పెరిగినా, 2013లో నమోదైన 44.6 శాతం గరిష్ఠస్థాయి కంటే తక్కువే. వృత్తిపరమైన, సాంకేతిక ఉద్యోగాల్లో సమానత్వ స్కోరు 2006లోని 26.6శాతం నుంచి 2026లో 49.9 శాతానికి పెరగడం సానుకూల పరిణామం. కానీ ఉన్నతాధికారులు, నిర్వాహకులు, శాసనసభ్యుల స్థానాల్లో స్కోరు కేవలం 13.1 శాతం మాత్రమే.

కార్మిక శక్తి భాగస్వామ్య సమానత్వ స్కోరు 44.1 శాతం. ఇది మహిళల్లో 44.1 శాతం మంది ఉద్యోగాలు చేస్తున్నారని అర్థం కాదు. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, 2025లో భారత్‌లో మహిళల కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 32.4 శాతం కాగా, పురుషుల్లో 77.6 శాతంగా ఉంది. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరగాలంటే ఉద్యోగాల సంఖ్యతోపాటు న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, ఆస్తి హక్కులు, రుణ సదుపాయాలు, స్వయం ఉపాధికి మార్కెట్ అవకాశాలు కల్పించాలి. గృహబాధ్యతల్లో పురుషులూ సమానంగా భాగస్వాములు కావాలి.

ఆరోగ్య, మనుగడ విభాగంలో భారత్ 95.6 శాతం స్కోరు సాధించినప్పటికీ, పుట్టుక సమయంలో లింగ నిష్పత్తికి సంబంధించిన అంతరం పూర్తిగా తొలగిపోలేదు. బాలికలకు పోషకాహారం, టీకాలు, రక్తహీనత నివారణ, యుక్తవయసు ఆరోగ్యఅవగాహన, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, గర్భిణులకు వైద్యం, ప్రసవానంతర సంరక్షణ అందాలి. గ్రామీణ, గిరిజన, పేద కుటుంబాల మహిళలకు వైద్య సేవలు చేరువ చేయాలి.

రాజకీయ సాధికారతలో భారత్ 24.5 శాతం స్కోరుతో 67వ స్థానంలో నిలిచింది. పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన సమానత్వ స్కోరు 16.1 శాతం కాగా, మంత్రివర్గ ప్రాతినిధ్య స్కోరు కేవలం 5.9 శాతం. 2019లో మంత్రివర్గ సూచిక 30 శాతం గరిష్ఠ స్థాయికి చేరినా, ఆ తర్వాత తగ్గింది.

ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరంలో ఐస్లాండ్ 93 శాతం స్కోరుతో మొదటి స్థానంలో, ఫిన్లాండ్ 87.2 శాతంతో రెండో స్థానంలో, నార్వే 85.7 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. ప్రస్తుత వేగంతోనే ప్రపంచం ముందుకు సాగితే సంపూర్ణ లింగ సమానత్వానికి ఇంకా 120 సంవత్సరాలు పట్టవచ్చని నివేదిక అంచనా వేస్తోంది. భారత్ 131వ స్థానం ఒక ర్యాంకు మాత్రమే కాదు. మహిళల అవకాశాలపై దేశం తనను తాను ప్రశ్నించు కోవాల్సిన హెచ్చరిక. చదువులో ముందున్న బాలిక ఉద్యోగంలో వెనుకబడకూడదు. శ్రమించే మహిళకు తగిన వేతనం దక్కాలి. రైతు మహిళకు భూమిపై హక్కు, రుణం, మార్కెట్ అవకాశాలు కలగాలి. ప్రతిభావంతురాలైన మహిళ రాజకీయాల్లోకి రావాలంటే అవకాశాలు పెరగాలి. మహిళలకు విద్య ఇచ్చి అవకాశాలు ఇవ్వకపోతే అభివృద్ధి అసంపూర్ణం. దేశం నిజంగా అభివృద్ధి చెందిందో లేదో తెలుసుకోవాలంటే మహిళలు ఎంత చదివారన్నదే కాదు.. ఎంత స్వతంత్రంగా జీవిస్తున్నారు, ఎంత సంపాదిస్తున్నారు, ఎంత నిర్ణయాధికారం కలిగి ఉన్నారు, ఎంత గౌరవంగా బతుకుతున్నారు అన్నదీ కొలవాలి. ప్రతిభకు అడ్డంకులు తొలగి, వారి శ్రమకు విలువ పెరిగి, వారి స్వరానికి అధికారంలో స్థానం దక్కినప్పుడే లింగ సమానత్వం నినాదం నుంచి వాస్తవంగా మారుతుంది.

- కాలగిరి శ్రీనివాసరెడ్డి
9010128884

# వారం రోజులైనా పూడ్చని రహదారి గుంత!

- ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం




**ఆర్మూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్):** ఆర్మూర్ పట్టణంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. డ్రైనేజీ మరమ్మతుల కోసం రహదారిపై గుంత తీసి వారం రోజులు గడుస్తున్నా, ఇంతవరకు మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే రహదారిపై గుంతను అలాగే వదిలేయడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

**రద్దీ రహదారిపై తప్పని ఇబ్బందులు.**

ఆర్మూర్ మీదుగా నిజామాబాద్కు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి ప్రధాన రహదారిపై భారీ గుంత ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతను తప్పించుకునే క్రమంలో వాహనాలు పక్కకు మళ్లించాల్సి వస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రివేళల్లో మరింత ప్రమాదకరం**

పగటిపూట కనిపించే గుంత రాత్రి వేళల్లో వాహనదారులకు సరిగ్గా కనిపించకపోవచ్చని స్థానికులు చెబుతున్నారు. సరైన హెచ్చరిక సూచికలు లేకపోతే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?**

డ్రైనేజీ మరమ్మతుల కోసం రహదారిని తవ్విన అనంతరం పనులను త్వరితగతిన పూర్తి చేసి, రహదారిని యథాస్థితికి తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే వారం రోజులుగా గుంతను పూడ్చకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకుండా సమస్యను పెండింగ్లో ఉంచడం సరైంది కాదని విమర్శిస్తున్నారు.

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్.**

ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే సమస్యను పరిష్కరించడం అవసరమని కాలనీవాసులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు రహదారిపై ఉన్న భారీ గుంతను పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు వాహనదారులకు ప్రమాదం జరగకుండా తగిన హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# 'స్వేచ్ఛా రథం' ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- వెట్టిచాకిరీ నిర్మూలనకు 'స్వేచ్ఛా రథం', కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం

**కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో):** వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టిచాకిరీ బాధితులకు అందించే సహాయం, పునరావాసంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

**బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి...**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ అక్కడక్కడ ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. బాధితులను గుర్తించి తక్షణమే రక్షించడంతోపాటు వారికి ప్రభుత్వ సహాయం, పునరావాసం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించి, వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పని ప్రదేశాల్లో అవగాహన....**

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా అసంఘటిత కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ దుష్పరిణామాలు, ఫిర్యాదుల నమోదు విధానాలను వివరించనున్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు, బలవంతపు ఒత్తిళ్లతో వెట్టిచాకిరీలో చిక్కుకున్నవారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయ వ్యవస్థలను తెలియజేయనున్నారు.

**హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలి...**

వెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434343 టోల్ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. కరపత్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో ఈ నంబరుపై ప్రచారం చేయనున్నారు.

**అధికారులతో ప్రతిజ్ఞ...**

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ మున్నం శశికుమార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్తోపాటు కార్మిక, పోలీసు, మానవ అక్రమ రవాణా నిరోధక, న్యాయ సేవలు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



- ఐడీఓసీలో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులు
- సామాజిక సమానత్వం, ఆత్మగౌరవంపై నేతల ఉద్ఘాటన
- పాల్గొన్న అదనపు కలెక్టర్ విక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు

**కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో):** తెలంగాణలో ధైర్యసాహసాలకు, ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ విక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకాగా, మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం, ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయడంతోపాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

పాల్గొన్న ప్రముఖులు

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కల్ల గంగారాజం ముదిరాజ్, కౌన్సిలర్లు కల్ల గణేష్ ముదిరాజ్, భాను ప్రసాద్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలా నాగరాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బహుజన సంఘ నాయకులు కొత్తపల్లి మల్లయ్య, ఒడ్డెర ఎల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నరేష్, పవన్, సునీత, స్వామి, శాంతీష్ సహా పలువురు హాజరయ్యారు.

# భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

- గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

**భిక్కనూరు, అక్టోబర్ 22 (మనం న్యూస్):** భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సమాచార విభాగం సంప్రదింపుల నిపుణుడు రాజీవ్ రంజన్ తివారి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహాయ ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ రాజేశం ఆధ్వర్యంలోని బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది.



ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారనే అంశాన్ని బృందం పరిశీలించింది. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారు అవసరమైన సందర్భాల్లో సంబంధిత చికిత్సా కేంద్రాలకు ఏ విధంగా పంపిస్తున్నారు అనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుంది. అనంతరం పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, అవసరమైన వైద్య సేవల కోసం సంబంధిత కేంద్రాలకు పంపించడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసింది.

గర్భిణీ స్త్రీలకు అవసరమైన పరీక్షలు సకాలంలో నిర్వహించి, వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని బృందం సూచించింది.

ఈ కార్యక్రమంలో బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వనశ్రీ, ఇతర వైద్య సిబ్బంది, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!




- జిల్లాలో 4-5 మీటర్ల మేర తగ్గిన భూగర్భ జలమట్టం, యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలి
- ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో):** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలని కోరారు. సదాశివనగర్ మండలం ధర్మారావుపేట రైతువేదికలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, పత్తి మార్కెటింగ్, కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. అనంతరం రైతునేస్తం, ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా రైతులతో కలెక్టర్ మాట్లాడారు.

**నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు.**

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని తెలిపారు. సదాశివనగర్, పెద్దకొడప్గల్, మహమ్మద్నగర్ మండలాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణలో కీలకమని పేర్కొన్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చెరువుల్లో నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

**ఉద్యాన పంటల సాగుపై దృష్టి.**

యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం, పంట మార్పిడి పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. ఇంకుడు గుంతలు, నీటి నిల్వ నిర్మాణాలతో వర్షపు నీటిని ఒడిసిపట్టాలని కోరారు. భూమి, నీటి పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగును పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అందరికీ నమస్కారం..

## ఇన్ స్టాలో సోనియా తొలి పోస్టు

**ఢిల్లీ, అక్టోబర్ 22 :** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్ స్టాలో చేరారు. గురువారం ఈ సోషల్ మీడియా వేదికపైకి వచ్చిన ఆమె.. తొలి పోస్టు పెట్టారు. ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో దానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను షేర్ చేశారు. 'అందరికీ నమస్కారం. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్ మీతో షేర్ చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ఈ కథ ప్రేమ, కర్తవ్యం, నష్టం వంటి ఎన్నో ఉద్వేగాలను తెలియజేస్తోంది' అంటూ తన కుమార్తె ప్రియాంకాగాంధీ, పబ్లిషర్లతో ఉన్న వీడియోను పంచుకున్నారు. నవంబర్ 10న ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.




# ట్రంప్ ఆంక్షలు విధిస్తే.. ఈయూ అవార్డు ఇచ్చింది

**న్యూయార్క్, అక్టోబర్ 22 :** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)పై అమెరికా ప్రభుత్వం ఇటీవల భారీ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఐసీసీతోపాటు ట్రైబ్యునల్లో పనిచేసే అధికారులకు యురోపియన్ యూనియన్ అత్యున్నత మానవ హక్కుల పురస్కారం సఖరోవ్ ప్రైజ్ వరించింది. ఈ అవార్డు ప్రకటించిన సందర్భంగా యురోపియన్ పార్లమెంట్ అధ్యక్షురాలు రాబర్టా మెట్సోలా మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలు, న్యాయాన్ని నిలబెట్టడంలో ఐసీసీ చేసిన కృషికి ఈ పురస్కారం ఓ నిదర్శనమన్నారు. సోవియట్ అసమ్మతివాది, నోబెల్ పురస్కార గ్రహీత ఆండ్రూ సఖరోవ్ పేరుమీద 1988లో ఈ అవార్డును ఈయూ అందజేస్తోంది. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛ కోసం కృషి చేసే వ్యక్తులు, సంస్థలకు ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. తాజాగా అవార్డు లభించడంపై ఐసీసీ అధ్యక్షురాలు టొమోకో అకానే స్వాగతించారు. న్యాయస్థానం, అధికారులు తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ఈ గుర్తింపు లభించడం ఎంతో సంతోషకర విషయమన్నారు. ఈ నేపథ్యంలోనే ఐసీసీ రద్దుకు ప్రయత్నిస్తున్న అగ్రరాజ్యం ఇటీవల భారీ ఆంక్షలు ప్రకటించింది. ఐసీసీ ఆర్థిక వనరులను స్తంభింపజేసేందుకు సిద్ధమైంది.

# బీఈఎల్‌తో రక్షణ ఒప్పందం

## రూ.770 కోట్ల విలువైన లైట్ వెయిట్ రాడార్ల కొనుగోలు



**ఢిల్లీ, అక్టోబర్ 22 :** త్రివిధ దళాల ఆయుధ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం మరో కీలక అడుగు వేసింది. లో లెవెల్ లైట్ వెయిట్ రాడార్లను కొనుగోలు చేసేందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తో ప్రభుత్వం సుమారు రూ.770 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ రాడార్లకు ఫైటర్ జెట్లు, మినీ, మైక్రో డ్రోన్లను పసిగట్టి ట్రాక్ చేయగల సామర్థ్యం ఉంది. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలన్న కేంద్రం లక్ష్యానికి అనుగుణంగా ఈ ఒప్పందం జరిగినట్లు రక్షణ శాఖ వివరించింది.

# ఫ్రాన్స్ వెళ్తున్నారా..? జాగ్రత్త భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

**పారిస్, అక్టోబర్ 22 :** మౌలిక వసతుల లేమి, పెరుగుతున్న ధరల వంటి సమస్యలతో ఫ్రాన్స్ మండిపోడుతోంది. ఈ అశాంతియుత పరిస్థితులు, స్థానికంగా కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్‌లోని భారత ఎంబసీ హెచ్చరించింది. ఫ్రాన్స్‌లో నివసిస్తున్న, ఆ దేశం వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు సూచనలు చేసింది. 'నిరసన ప్రదేశాలు, జనాలు భారీగా గుమిగూడిన ప్రాంతాలకు వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వాలు ఇచ్చే అధికారిక అడ్వైజరీలను గమనించుకోండి. రవాణాకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోండి'అని ఎంబసీ సూచించింది. సంబంధిత వెబ్‌సైట్ల వివరాలు షేర్ చేసింది.

**ట్రంప్‌పై మేక్రాన్ ఆగ్రహం..**

తమ దేశంలో జరుగుతోన్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ఖండించారు. రాజకీయ లబ్ధికోసమే విదేశీ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్రాన్స్‌లో హింసాత్మక ఘటనలకు అక్కడి ప్రభుత్వ వలస విధానాలే కారణమని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. 'అవొక మూర్ఖపు మాటలు. వాటికి ఎలాంటి ఆమోదయోగ్యత లేదు'అని మేక్రాన్ మండిపడ్డారు.



# టర్కియే, ఖతార్, ఇండొనేసియాలతో

## పాక్ రక్షణ ఒప్పందం

## ధృవీకరించని పాకిస్థాన్ విదేశాంగ శాఖ

**ఇస్లామాబాద్, అక్టోబర్ 22 :** పాకిస్థాన్, టర్కియే, ఖతార్, ఇండొనేసియా దేశాలు బుధవారం దోహాలో ఒక రక్షణ సహకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. 'బద్ర్ అవగాహన ఒప్పందం' అని నామకరణం చేసిన ఈ ఒప్పందంపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, టర్కియే రక్షణ మంత్రి యాసర్ గులేర్, ఖతార్ ఉప ప్రధాని షేక్ సౌద్ బిన్ అబ్దుల్ రహమాన్, ఇండొనేసియా రక్షణశాఖ ఉపమంత్రి యూసుఫ్ జౌహరీలు సంతకాలు చేశారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. బద్ర్ ఒప్పందంపై జరిగిన సంతకాలకు సంబంధించి పాకిస్థాన్ విదేశాంగ శాఖ ఎలాంటి ప్రకటనా వెలువరించలేదు. మరోవైపు మాల్దీవులతో కూడా పాకిస్థాన్ బుధవారం 20 ఒప్పందాలపై సంతకాలు చేసింది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజు ఇస్లామాబాద్‌లో మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

# రేహాన్ వాద్రా 'నిరసనల ఫొటోల వివాదం'..

- స్పందించిన బికనేర్ హౌస్

**ఢిల్లీ, అక్టోబర్ 22 :** కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ కుమారుడు రేహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ రాజకీయంగా వివాదానికి దారితీసింది. ఢిల్లీలోని బికనేర్ హౌస్ లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట ఆయన తీసిన కొన్ని ఫొటోలను ఎగ్జిబిషన్ కు బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బికనేర్ హౌస్ స్పష్టతనిచ్చింది. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట రేహాన్ తాను తీసిన ఫొటోలను తొలిసారి ప్రదర్శనకు ఉంచారు. వన్యప్రాణులు సహా ఇతర థీములు, ఢిల్లీలో జరిగిన నిరసనలను ఫొటోలు తీసి ఎగ్జిబిషన్ పెట్టారు. ఆ ఫొటోల్లో కొన్ని రాజకీయ ఉద్దేశాన్ని కలిగి ఉన్నాయని, సంస్థ విధానానికి వ్యతిరేకమంటూ బికనేర్ హౌస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కళలు, సంస్కృతిని ప్రతిబింబించేవాటిని మాత్రమే ప్రదర్శనకు ఉంచాలని, అందుకే వాటిని తొలగించాలని కోరినట్లు చెప్పింది. ప్రదర్శన ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందే తన ప్రదర్శించిన ఫొటోల్లో చాలావరకు తొలగించాలని, రద్దు చేసుకోవాలని నిర్వాహకులు చెప్పినట్లు వాద్రా సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. అందులో రెచ్చగొట్టేవి ఏవీ లేవన్నారు. కళాకారుల భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం షురువైంది.






## పెంటపాడులోఎంపీటీసీ స్థానాలకు 61 నామినేషన్లు



**పెంటపాడు, అక్టోబర్ 22 (మనం న్యూస్) :** స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పెంటపాడు మండల పరిధిలోని గ్రామాల నుండి గురువారం 39 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో ఎం. వెంకటేశు తెలిపారు.గురువారం ఒక్కరోజే జనసేన పార్టీ నుండి 10 మంది, టీడీపీ నుండి 5 గురు, బీజేపీ నుండి 2 గురు, వైఎస్సార్సీపీ నుండి 22 మంది నామినేషన్లు వేశారని ఆయన పేర్కొన్నారు.బుధ, గురువారాలు రెండు రోజులు కలిపి మొత్తంగా జనసేన నుండి 17 మంది, టీడీపీ నుండి 6 గురు, బీజేపీ నుండి 2 గురు, వైఎస్సార్సీపీ నుండి 36 మంది చొప్పున మొత్తం 61 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు.

## నామినేషన్ దాఖలు చేసిన పాలకొల్లు జడ్పిటిసి కూటమి అభ్యర్థిని మేడిది ఉషారాణి జాన్ రాజు



**పాలకొల్లు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి:** పాలకొల్లు మండల జడ్పిటిసి కూటమి అభ్యర్థి ని మేడిది ఉషారాణి జాన్ రాజు గురువారం భీమవరంలోని జడ్పీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ మేరకు ఆ వివరాలు స్థానిక విలేకరులకు తెలిపారు.ఈ సందర్బంగా ఉషారాణి జాన్ రాజు మాట్లాడు తూ తనకు ఈ అవకాశం కల్పించి నందుకు మంత్రి నిమ్మల రామానాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.

## జడ్పీటీసీ బరిలో వైసీపీ అభ్యర్థులు వాసు రెడ్డి,సౌమ్య, నామినేషన్లు



- **రంగనాథరాజు సమక్షంలో నామినేషన్ పత్రాలు సమర్పణ**

**భీమవరం, అక్టోబరు 22, మనం ప్రతినిధి:** పోడూరు, పెనుమంట్ర మండలాల జడ్పీటీసీ స్థానాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గా కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి),సరేళ్ళ సౌమ్య, గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీకి నామినేషన్ పత్రాలను అందజేశారు.రాష్ట్ర మాజీ మంత్రి, వైసీపీ ఆచంట నియోజకవర్గ ఇన్చార్జి చెరకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో ఇరువురు అభ్యర్థులు నామపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ పార్లమెంటరీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గుంటూరి పెద్దిరాజు, ఆచంట నియోజకవర్గ నాయకులతో పాటు పోడూరు, పెనుమంట్ర మండ లాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. వాసురెడ్డి నామినేషన్ కార్యక్రమా నికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## పోడూరు జెడ్పీటీసీ బరిలో మాజీ సర్పంచ్ దాసరి మిస్సమ్మ!



### టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

**భీమవరం, అక్టోబరు 22, మనం ప్రతినిధి:** పోడూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున జిన్నూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దాసరి మిస్సమ్మ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీకి నామినేషన్ పత్రాలను అందజేశారు.దాసరి మిస్సమ్మ గతంలో జిన్నూరు గ్రామ సర్పంచ్గా పనిచేశారు. ఆమె భర్త దాసరి రత్నంరాజు ప్రస్తుతం పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన పోడూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.మిస్సమ్మ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పోడూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# పాలకొల్లులో వైసీపీకి మరో షాక్

## మాజీ ఎంపీపీ కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు టీడీపీలో చేరిక



**పాలకొల్లు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి:** నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు రోజుల క్రితం చింతపర్రు గ్రామంలో 50కిపైగా కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరగా.. తాజాగా పాలకొల్లు మండల మాజీ ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఏడుకొండలుతో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయం వద్ద గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో వారు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి, ఏడుకొండల దంపతులను పార్టీ కండువాలు కప్పి మంత్రి సత్కరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఏడుకొండలు తెలిపారు. వైసీపీలో సుమారు 16 ఏళ్లపాటు కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని, ఆక్వా వ్యాపారాన్ని సైతం వదులుకొని ఆర్థికంగా నష్టపోయానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు, పాలకొల్లు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులను కలుపుకొని పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఏడుకొండలు, కనకలక్ష్మి దంపతులు టీడీపీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గత రెండున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు సాధించి గ్రామాలు, పట్టణ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ.. వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభించకపోగా, పార్టీ కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఏడుకొండలు దంపతులు టీడీపీలో చేరడం సమంజసమన్నారు. కనకలక్ష్మి మాట్లాడుతూ తాను ఎవరినీ విమర్శించదలచుకోలేదని, వైసీపీలో తగిన గౌరవం లభించకపోవడంతో పాటు ఎంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు టీడీపీ అధ్యక్షుడు పాముల రజనీకుమార్, నాయకులు మేడిది డేవిడ్ జాన్రాజు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, ఆరుమిల్లి చిన్ని, బోనం నాని, పొట్నూరి శ్రీనివాస్, బిరుదుకోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోడూరు ఎంపీపీ అభ్యర్థిగా దొంగ సూర్య వరప్రసాద్

- **టీడీపీ నుంచి పోడూరు-2 ఎంపీటీసీగా నామినేషన్.**
- **40 ఏళ్ల రాజకీయ అనుభవంతో మండల అభివృద్ధికి కృషి చేస్తా.**



**పోడూరు, అక్టోబరు 22, మనం ప్రతినిధి :** పోడూరు మండల పరిషత్ అధ్యక్ష పదవి అభ్యర్థిగా కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దొంగ సూర్య వరప్రసాద్ బరిలో నిలిచారు. గురువారం పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో పోడూరు-2 ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆశీస్సులతో ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని అందుకు పితాని సత్యనారాయణకు తన మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న సూర్య వరప్రసాద్ ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

**మండల అభివృద్ధే ధ్యేయం**

నామినేషన్ దాఖలు చేసిన తదనంతరం ఆయన మాట్లాడుతూ పోడూరు మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సూర్య వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమ ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

**భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు**

సూర్య వరప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్రాజు, టీడీపీ నాయకులు రుద్రరాజు సీతారామరాజు (రవిరాజు), రుద్రరాజు బంగారురాజు, మాజీ ఉపసర్పంచ్ శిలబోయిన జయరామకృష్ణ, మాజీ సర్పంచ్ కుక్కల దుర్గారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## రెండవ రోజు 44 నామినేషన్‌లు దాఖలు



**కాత్రేనికోన అక్టోబర్ 22 మనం ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కాత్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జి మమ్మీ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బి రాజేశ్వర్ రావు, వి రవి కిరణ్ లు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.రెండవ రోజు మొత్తం 44 నామినేషన్లు వచ్చినట్లు ఆర్.. ఓ తెలిపారు. ఇందులో టీడీపీ 17, వైసీపీ 21, జనసేన 4, బి ఎస్పీ1 ఇండిపెండెంట్ 1 ఉన్నాయి. కాత్రేనికోన,2, 3 ఎంపీటీసీ స్థానాలకు ,మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, చెయ్యేరు 1 కి మాజీ సర్పంచ్ చెల్లి సురేష్, చెయ్యేరు 2 నడింపల్లి సందీప్ వర్మ, పల్లం 1 దండుప్రోలు బాలయోగి, బంటుమిల్లి - ఉప్పూడి నల్లా రాంబాబు తదితరులు నామినేషన్ వేశారు. వర్షం కారణంగా నామినేషన్ లు వేయడానికి ఇబ్బందులు పడ్డారు నామినేషన్ కేంద్రాల వద్ద సి సి కెమెరా లు ఏర్పాటు చేశారు విధమైన అవా ంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ ఐ వి దుర్గా శ్రీనివాస్, అదనపు ఎస్ఐ వి సత్య నారాయణ పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు . మూడవ రోజు అధిక సంఖ్యలో నామినేషన్ దాఖలు అయ్యే అవకాశం ఉంది . ఈ కార్యక్రమం లో వైసీపీ, టీడీపీ జనసేన , బి ఎస్పీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీపీ లక్ష్యంగా గుడాల చంటిబాబు నామినేషన్ దాఖలు

- **జగన్నాథపురం -కొమ్ముచిక్కాల ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు**



**పోడూరు, అక్టోబరు 22, మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పోడూరు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు గుడాల చంటిబాబు జగన్నాథపురం -కొమ్ముచిక్కాల ఎంపీటీసీ అభ్యర్థిగా గురువారం మాజీ జెడ్పిటిసి వైఎస్ఆర్సిపి పార్లమెంటరీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గుంటూరు పెద్దిరాజు సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. మండల పరిషత్ అధ్యక్ష పదవి ఆశావహుడిగా ఉన్న ఆయన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆశీస్సులతో నామినేషన్ వేశారు.
మాజీ ఎంపీటీసీ గణపతిరాజు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ శైలజకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా గుడాల చంటిబాబు మాట్లాడుతూ, ఎంపీటీసీగా విజయం సాధించి, ఎంపీపీగా ఎన్నికైతే పోడూరు మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన అన్నారు.

## ఎంపీటీసీ 1 సిపిఎం అభ్యర్థిగా కాకర వెంకటేశ్వర్లు

- **ప్రజలకోసం, ప్రజా సమస్యలకోసం నిరంతరం పోరాటం చేస్తాను**

**పోడూరు అక్టోబర్ 22 మనం న్యూస్ :** పోడూరు మండలంలోని పోడూరు ఎంపీటీసీ 1 లో సీపీఎం పార్టీ తరపున పోటీ చేస్తున్న పోరాట నాయకుడు కాకర వెంకటేశ్వర్లు గురువారం పోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ సరైన డంపింగ్ యార్డు లేక స్మశాన వాటికలో చెత్త కుప్పలు కుప్పలుగా పేర్కొని అధ్వానంగా ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సరైన నీటి వసతి కూడా లేదుని ఆవేదన వ్యక్తం చేసారు . పాలకులు మారినా సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని గుర్తు చేసారు. సరైన డ్రైనేజీలు లేక పల్లపు రోడ్లు వర్షం నీటికి చెరువులను తలపిస్తున్నాయని వాపోయారు.ఈసమస్యలతోపాటు దళిత స్మశాన సమస్య పరిస్కారం కోసం, ప్రభుత్వ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజి సమస్యలు కోసం సిపిఎం నిరంతరం పోరాడుతుందని మరోసారి గుర్తుచేశారు.పై తెలిపిన సమస్యలు పరిస్కారం కోసం నిరంతరం పనిచేస్తానని, నన్ను మీరంతా మద్దతు ఇచ్చి సిపిఎం పార్టీ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై మీ అమూల్యమైన ఓటుముద్ర వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి ప్రజలందరిని కోరుచున్నానని ఆయన తెలిపారు.



ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యు లు మూడే మోజేష్, కాటూరి యాకోబు, బొంతు శ్రీను, అభిమానులు కె సుబ్బారావు, ఎస్ పృధ్వి, వి చంటి, ఎం రామకృష్ణ, ఎన్ సంషోను, కె నాహుమ్ తదితరులు పాల్గొని మద్దతుగా నిలిచారు .

## నామినేషన్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాల కరువు !




**తాడేపల్లిగూడెం అక్టోబర్ 22 (మనం న్యూస్) :** నామినేషన్ కేంద్రాల వద్ద కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను ఎన్నికల సిబ్బంది పర్యవేక్షిస్తున్నప్పటికీ, అభ్యర్థులు కూర్చోవడానికి కనీస వసతులు కూడా కల్పించలేదు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు తాగునీటి కోసం తహతహలాడారు. మంచినీటి బాటిల్ కోసం చుట్టుపక్కల దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.అభ్యర్థులకే కాకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, భద్రతా విధుల్లో ఉన్న పోలీసులకు కూడా తాగునీరు అందుబాటులో లేకపోవడంతో బయట నుండి డబ్బులు పెట్టి బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది.వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభ్యర్థులకు ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. సాధారణంగా నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను కూడా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేయకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కనీస సౌకర్యాలు కల్పించకుండా నామినేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారంటూ ఆర్వో పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రానున్న మండల పరిషత్ ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వహించేందుకు 7500 మందిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తాడేపల్లిగూడెం మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధులపై ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ విధుల నిమిత్తం బాధ్యతలు స్వీకరించేందుకు రాధా కృష్ణ కుమారి మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చారు. నామినేషన్ కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## సింహగిరి అప్పన్న స్వామివారికి ఎస్బీఐ



- **ఆధ్వర్యంలో రెండు బొలేరో గూడ్స్ వాహనాల విరాళం**

**సింహాచలం:అక్టోబర్22:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖిఆఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రెండు బొలేరో గూడ్స్ వాహనాలను విరాళంగా అందజేసింది.

ఎస్బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ సౌజన్యంతో సమకూరిన ఈ వాహనాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి వెంకట్రావు సమక్షంలో దేవస్థానానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వాహనాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవస్థాన నిత్య సేవా కార్యకలాపాలు, సామగ్రి రవాణా అవసరాల నిమిత్తం ఈ ఎలక్ట్రికల్ వాహనాలను స్వామివారి సేవకు వినియోగించనున్నట్లు ఈవో తెలిపారు. అప్పన్న స్వామి వారి పట్ల భక్తిప్రపత్తులతో, సేవా దృక్పథంతో వాహనాలను సమర్పించిన ఎస్బీఐ యాజమాన్యానికి ఆలయ ఇఓ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో దేవస్థాన ఇన్-ఛార్జ్ డిప్యూటీ ఇంజనీర్ రామరాజు, ఎస్బీఐ సింహాచలం బ్రాంచ్ మేనేజర్ తో పాటు ఇతర ఆలయ సిబ్బంది, బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సి కే పల్లి టీడీపీ నేతలపై ఇంచార్జ్ సీ ఐ దాడి

- **ఉదయం 7.30 గంటలకే వైసిపి అభ్యర్థులు నామినేషన్ కేంద్రంలోకి అనుమతి**
- **టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు సిద్ధం**
- **సంఘటనపై నాయకులు, కార్యకర్తలతో చర్చించిన పరిటాల సునీతమ్మ , ఎంఎస్ రాజు**
- **ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే సునీతమ్మ, ఎంఎస్ రాజు**



**చెన్నేకొత్తపల్లి ,అక్టోబర్ 22 మనం న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా విధులు లో ఉన్న చెన్నేకొత్తపల్లి ఇన్ ఛార్జి సీఐ ఇస్మాయిల్ అత్యుత్సాహం ప్రదర్శించారు. నామినేషన్ కేంద్రాలకు దూరంగా ఉన్న టీడీపీ నేతలపై లాఠీలతో దాడి చేశారు. అదే సీఐ ఉదయం 7.30 గంటలకే నామినేషన్ కేంద్రాల్లోకి వైసీపీ అభ్యర్థులను అనుమతించడంతో పాటు సీఐ వారితో కరచాలనం చేస్తూ చనువుగా ప్రవర్తించారు అని టిడిపి వారు ఆరోపించారు. మరోవైపు పుట్టపర్తిలో పని చేస్తున్న న్యామద్దల గ్రామానికి చెందిన హోంగార్డ్ నాగేంద్ర బంధువు నామినేషన్ వేసేందుకు రాగా ఆ సమయంలో టీడీపీ నేతలు అక్కడ ఉండకుండా చెదరగొట్టే ప్రయత్నం చేశారు. వారు తమ పార్టీ నాయకుల నామినేషన్ కు వచ్చామని చెబుతున్నా వినకుండా విచక్షణారహితంగా లాఠీలతో చితకబాదారు.దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, సత్య సాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నేతలతో మాట్లాడగా. సీఐ, ఎస్ఐ వ్యవహరించిన తీరు గురించి వివరించారు. దీంతో ఎమ్మెల్యే సునీతమ్మ నేరుగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఫోన్ చేశారు. తమ పార్టీ నాయకులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఉన్న చోట ఇలా సీఐ దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ దీనిపై స్పందిస్తూ. సీఐ, హోంగార్డుల మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టీడీపీ నేతలు శాంతించారు. వైసీపీ నాయకులు నామినేషన్ వేయడంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని. స్వేచ్ఛగా వేసుకోవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కానీ ప్రశాంతంగా ఉన్న చోట టీడీపీ నేతలపై పోలీసులు వారి స్వప్రయోజనాల కోసం దాడులు చేయడం ఏంటని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఎన్నికల కమిషన్ కు కూడా ఫిర్యాదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## ఎన్నికల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్**



**విశాఖపట్నం, అక్టోబర్ 22:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. రమేష్, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులతో కలిసి నార్త్ జోన్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, జ్ఞాన నికేతన్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గాజువాక జోన్లోని బీహెచ్ఈఎల్ టౌన్షిప్, గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.




# సీడీఎస్ఎల్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0 ప్రారంభం

- ఇన్వెస్టర్ అవగాహన భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యార్థులకు ఆహ్వానం

CDSL REIMAGINE | ideathon

**కర్నూల్ అక్టోబర్ 22, మనం న్యూస్ :** వరల్డ్ ఇన్వెస్టర్ వీక్ 2026 సందర్భంగా సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0ను ఘనంగా ప్రారంభించింది. ఆర్థిక అవగాహన, సైబర్ భద్రతను బలోపేతం చేసే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిందిగా భారతదేశం అంతటా ఉన్న విద్యార్థులను ఈ వేదిక ఆహ్వానిస్తోంది. డిజిటల్ మారుతున్న ఇన్వెస్టర్లకు తగినట్లుగా సేవలను అందించడం దీని ప్రధాన ఉద్దేశం. భారతదేశంలో 'సమాజ్ సే ఇన్వెస్టింగ్ సింపుల్' థీమ్తో కొనసాగుతున్న ఈ కార్యక్రమం.. సెబీ చేపట్టిన 'ప్రాజెక్ట్ జాగరూక్' ఇన్వెస్టర్ అవగాహన , విద్య లక్ష్యాలకు సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఆర్థిక అక్షరాస్యతను పెంచడానికి, సమాచారంతో కూడిన పెట్టుబడి విధానాలను ప్రోత్సహించడానికి , ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించడానికి సెబీతో పాటు సీడీఎస్ఎల్ వంటి సెక్యూరిటీస్ మార్కెట్ భాగస్వాములు ఇందులో కలిసి పనిచేస్తున్నాయి. అవగాహన ఉన్న ఇన్వెస్టర్రే శక్తివంతమైన ఇన్వెస్టర్ అనే భావనతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది.

సెబీ ఇన్వెస్టర్ సర్వే 2025 ప్రకారం.. దేశంలోని సుమారు 33.72 కోట్ల కుటుంబాలలో 3.21 కోట్ల కుటుంబాలు (9.5 శాతం) మాత్రమే సెక్యూరిటీస్ మార్కెట్ ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టాయి. అయితే 63 శాతం కుటుంబాలకు కనీసం ఒక్క సెక్యూరిటీస్ మార్కెట్ ఉత్పత్తి గురించైనా అవగాహన ఉంది. ఈ అవగాహనకు, భాగస్వామ్యానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 23 కోట్లు దాటినప్పటికీ, ప్రభుత్వ డేటా ప్రకారం 2025లో సైబర్ మోసాల వల్ల రూ.22,495 కోట్లు నష్టపోయినట్లు వెల్లడైంది. ఇందులో 76 శాతం నష్టాలు నకిలీ పెట్టుబడి , ట్రేడింగ్ స్కామ్లు వల్ల జరిగినవే కావడం గమనార్హం.

ఈ సందర్భంగా సీడీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నేహాల్ వోరా మాట్లాడుతూ.. ఇన్వెస్టర్లు తమంతట తాముగా సమాచారాన్ని అంచనా వేసి, సరైన నిర్ణయాలు తీసుకోగలగాలని పేర్కొన్నారు. యువతకు కూడా ఈ అవగాహనను చేరవేయడానికి అమర్ చిత్ర కథతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, విద్యార్థులలో ఆర్థిక అక్షరాస్యతను పెంచే సెబీ 'మస్ట్'(ఖఖీఖీ) కార్యక్రమానికి కూడా ఈ ఐడియాథాన్ తోడ్పాటునందిస్తుంది.

పాల్గొనే విద్యార్థులు డిజిటల్ ప్లాట్ఫారమ్లు, మొబైల్ యాప్లు, వెబ్సైట్లు, చాట్బాట్లు, గేమ్లు, సిమ్యులేషన్లు, లెర్నింగ్ మోడ్యూల్స్, అవగాహన ప్రచారాలు లేదా ఏఐ-ఎనేబుల్ అసిస్టెంట్ల రూపంలో తమ ఆలోచనలను సమర్పించవచ్చు. ఆవిష్కరణ, యూజర్ అనుభవం, ప్రభావం, అమలు సాధ్యత, డేటా రక్షణ వంటి అంశాల ఆధారంగా నిపుణుల జ్యూరీ వీటిని పరిశీలిస్తుంది. టీసీఎస్ మాజీ సీఈఓ, కర్మయోగి భారత్ చైర్పర్సన్ ఎస్. రామదొరై ఈ జ్యూరీకి అధ్యక్షత వహిస్తారు.

అక్టోబర్ 7, 2026 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ ఐదు టీమ్లకు మొత్తం రూ.11.5 లక్షల ప్రైజ్ పూల్ అందజేస్తారు. గతంలో మొదటి రీఇమేజిన్ ఐడియాథాన్కు భారీ స్పందన లభించగా, ఇప్పుడు దాని విజయంతో ఈ రెండో విడతను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు.



## బేతంచెర్లకు 106 ఎంపీటీసీ బ్యాలెట్ బాక్సుల చేరిక

**బేతంచేర్ల అక్టోబర్ 22( మనం న్యూస్):** బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 106 బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా బ్యాలెట్ బాక్సులు కార్యాలయానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం. ఫజుల్ రహిమాన్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సునీల్ కుమార్ అ ఇద్రుస్ భాషా డిప్యూటీ ఎంపీడీవో బి. మల్లికార్జున తదితరులు బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి

**కర్నూల్ అక్టోబర్ 22 (మనం న్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థకు సంబంధించి స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి ఐఏఎస్, అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నగర శివార్లలోని అథెనా స్కూల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.కౌంటింగ్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్లు, బ్యాలెట్ బాక్సుల భద్రపరిచే



స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు గదులు, అధికారుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం వచ్చే సిబ్బంది, అధికారులు, ఇతర సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్కు తగిన స్థలాన్ని కేటాయించి, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు, ఓట్ల లెక్కింపు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు, అధికారుల విధుల నిర్వహణకు అనువైన వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. పెండింగ్లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి , డిసిపి శబ్నం శాస్త్రీ, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈ నరేష్, శ్రీనివాసన్, పవన్ కుమార్ రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- 65, 66వ వార్డుల్లో మంత్రి టీజీ భరత్ ఎన్నికల ప్రచారం

**కర్నూలుఅక్టోబర్ 22మనం న్యూస్ :** కర్నూలు నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కర్నూలు నగరంలోని 65, 66వ వార్డుల్లో మంత్రి టీజీ భరత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష, 65వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మణిశంకర్ నాయుడు, 66వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి త్రివేణి పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి ఓటు వేయాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో కర్నూలు నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నగర అభివృద్ధిని ఇదే విధంగా ముందుకు తీసుకెళ్లాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అసెంబ్లీకి హాజరుకాని వైసీపీ ప్రజాప్రతినిధులకు ఓటు వేస్తే ప్రజలకు ఏమి ప్రయోజనం ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై చర్చించే వేదికైన అసెంబ్లీకే హాజరుకాని వారు, ఇప్పుడు కార్పొరేషన్లో ప్రజల సమస్యలపై ఎలా పోరాడతారని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నగర అభివృద్ధికి కృషి చేసే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రజల ఆశీస్సులతో కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం

### మంత్రి టీజీ భరత్

**కర్నూలు అక్టోబర్ 22మనం న్యూస్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కర్నూలు నగరంలోని 19వ వార్డుకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. మంత్రి టీజీ భరత్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ అన్వర్ భాష, షేక్ చాంద్ భాష, షేక్ అబ్బాస్ ఖాన్ తదితరులు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా కమేలా ప్రాంతంతో పాటు కర్నూలు



నగరంలోని పలు వార్డులకు చెందిన ముస్లిం నాయకులు కూడా మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నగరంలో అభివృద్ధి పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పనిచేసే వారికే ప్రజలు మద్దతు ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, కులమతాలకు అతీతంగా కర్నూలు నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, నగర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు కూటమి మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, కార్పొరేటర్ అభ్యర్థులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు 73 నామినేషన్లు దాఖలు

### టీడీపీ 34,,వైసీపీ35, టీడీపీ రెబల్ 4 నామినేషన్లు దాఖలు

**మంత్రాలయం , న్యూస్ :** స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా ఎంపిటిసి స్థానాలకు రెండవ రోజు 73 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలవర్థిరాజు తెలిపారు. ప్రధాన పార్టీలైన టీడీపీ , వైసీపీ పార్టీ అభ్యర్థులు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మాధవరం 1ఎంపిటిసి



స్థానానికి టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సతీమణి తెదేపా అభ్యర్థిగా యశోద మ్మ , చంద్రిక టీడీపీ యువ నాయకులు రాకేష్ రెడ్డి , రాజారెడ్డి తో కలిసి , బసాపురం ఎంపిటిసి స్థానానికి వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు సతీమణి అనుసుయ దేవి వైకాపా మండలాధ్యక్షుడు భీంరెడ్డి , వైకాపా ఇన్చార్జ్ విశ్వనాథ్ రెడ్డి తో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలవర్థిరాజు అందజేశారు. అలాగే మాధవరం ఎంపిటిసి 2 స్థానానికి తెదేపా అభ్యర్థిగా శ్రీనివాసులు సూగురు గ్రామ ఎంపిటిసి స్థానానికి తెదేపా అభ్యర్థిగా ఇజాయిల్ , మంత్రాలయం పాత ఊరు స్థానానికి తెదేపా అభ్యర్థిగా కమ్మరి ఉష , రామచంద్రనగర్ ఎంపిటిసి స్థానానికి అభ్యర్థి మేకల నాగమ్మ , రాఘవేంద్రపురం స్థానానికి అభ్యర్థి రాజేశ్వరి , కల్లుదేవకుంట ఎంపిటిసి స్థానానికి తలారి రాఘున్న , బూదరు ఎంపిటిసి స్థానానికి స్వరూపరాణి , వగరూర్ , సుంకేశ్వరి , చిలకలడోణ , చెట్నెహళ్ళి క సింగరాజన్నహళ్ళి , మాలపల్లి , చౌటపల్లి , సుంకేశ్వరి , గ్రామాల ఎంపిటిసి స్థానాలకు ఇరుపార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. రాంపురం కాచాపురం తదితర లో వైకాపా అభ్యర్థులు ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు వేశారు.

## మరోసారి మానవత్వాన్ని చాటుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత

**విశాఖపట్నం మనం న్యూస్ :** విశాఖపట్నంలోని ఆరిలోవ హెల్త్ సిటీ బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీని ఢీకొట్టిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి.ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు తక్షణ సాయం అందించి హోం మంత్రి అనిత మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. విశాఖపట్నం నుంచి బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా పాయకరావుపేట వెళ్తుండగా ఘటనను గమనించిన మంత్రి అనిత, వెంటనే తన కాన్వాయ్ ని ఆపి గాయపడిన విద్యార్థులను స్వయంగా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించడంతో పాటు, ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం డ్రైవ్ప చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 26 చివరి తేది

**ఏలేశ్వరం,అక్టోబర్ 22(మనం న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 26వ తేదీ చివరి గడువుగా ఉన్నత విద్యాశాఖ ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.విద్యార్థులు అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ లోపు తమ పేర్లను ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.కళాశాలలో బీఎస్సీ (బోటనీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఏ (ఎకనామిక్స్), బీకాం (కంప్యూటర్స్) కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో స్మార్ట్ తరగతి గదులు,ఆధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలు,నూతన కంప్యూటర్లతో కంప్యూటర్ ల్యాబ్లు, ఓపెన్ జిమ్ వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించాలని ఆమె కోరారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు అక్టోబర్ 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాలకు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ప్రవేశాలు పొందే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తించకపోవచ్చని పేర్కొంటూ,అర్హులైన విద్యార్థులందరూ చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

## రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్లు వెయ్యని అభ్యర్థులు

**బేతంచేర్ల అక్టోబర్ 22 (మనం న్యూస్):** బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ రెండో రోజు ఒక్క నామినేషన్ వేయని అభ్యర్థులు నామినేషన్ల స్వీకరణకు అధికారులు అవసరమైన



అన్ని ఏర్పాట్లు చేపట్టినప్పటికీ అభ్యర్థుల నామినేషన్లు వెయ్యలేదని రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం. ఫజుల్ రహిమాన్ తెలిపారు ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సునీల్ కుమార్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలిస్తూ నామినేషన్ల ప్రక్రియ ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం జరిగేలా ఏర్పాట్లు చేశారు

ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని అధికారులు తెలిపారు అర్హులైన అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ అవసరమైన పత్రాలతో తమ నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు

## మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించుకుందాం

**నందికొట్కూరు (మనం న్యూస్):** మహర్షి వాల్మీకి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామని సామాజిక సేవ నిర్వాహకులు గుజ్జుల గౌరీశ్వరనాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుందామని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి స్థానిక వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులను ఆహ్వానించాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు.మహర్షి వాల్మీకి జయంతిని ఈ నెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల్లో గౌరవప్రదంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేయాలని మహర్షి వాల్మీకి బోయ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు కోరారు. ఆయన




ఆశయాలు ప్రతి ఒక్కరికీ చేరాలి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి పాఠశాలల వరకు జయంతి స్ఫూర్తి కనిపించాలి. స్థానిక వాల్మీకి బోయ సోదరులను భాగస్వాములను చేసి, అందరి సహకారంతో వేడుకలను విజయవంతం చేయాలి అని గుజ్జుల గౌరీశ్వర నాయుడు కోరారు.

# అభ్యర్థుల ఎంపికపై తీవ్ర ఉత్కంఠ!

**కవిటి, అక్టోబర్ 22. మనం న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల సమరం సమీపిస్తున్న వేళ కవిటి మండలంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తీవ్ర ఆసక్తిని రేపుతోంది. కీలకమైన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలైన వైఎస్సార్సీపీ, టీడీపీలు పావులు కదుపుతున్నాయి. ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడంతో రెండు పార్టీల శిబిరాల్లోనూ అంతర్గత చర్చలు, సమావేశాలు ఊపందుకున్నాయి. వైఎస్సార్సీపీలో జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొనగా, టీడీపీలో ఎంపీపీ పీఠాన్ని అధిష్టించే నాయకుడు ఎవరన్న చర్చ జోరుగా సాగుతోంది.

**వైఎస్సార్సీపీలో జడ్పీటీసీ అభ్యర్థిత్వంపై తీవ్ర కసరత్తు**

వైఎస్సార్సీపీ తరఫున ఎంపీపీ అభ్యర్థిగా కడియాల పద్మా ప్రకాష్ పేరు ఇప్పటికే దాదాపు ఖరారైనట్లు సమాచారం. అయితే, జడ్పీటీసీ అభ్యర్థి విషయంలో మాత్రం పార్టీ అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈ స్థానానికి కాయ భీమసేన్, రజినీకుమార్ పేర్లు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. స్థానిక సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలు, మండల స్థాయి నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ సస్పెన్స్ తెరపడేలా లేదు.

**టీడీపీలో ఎంపీపీ పీఠంపై సస్పెన్స్**

మరోవైపు టీడీపీలో జడ్పీటీసీ అభ్యర్థిగా పొందల కృష్ణారావు పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ ఎంపీపీ అభ్యర్థిత్వం ఇంకా కొలిక్కి రాలేదు. ఈ స్థానానికి సిపాన రాణి , పట్నాయకుని జయశ్రీ పేర్లు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. దీంతో పార్టీ నాయకత్వం సీనియారిటీకి పెద్దపీట వేస్తుందా? లేక యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తుందా? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

**నాయకత్వంపై ప్రజల ఆసక్తి**

మండల సర్వతోముఖాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ సమస్యల పరిష్కారానికి ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు ఎంతో కీలకం కావడంతో స్థానిక ప్రజలు సైతం అభ్యర్థుల ఎంపికను నిశితంగా గమనిస్తున్నారు. తమ ప్రాంతానికి న్యాయం చేసే సరైన నాయకులను పార్టీలు ఎంపిక చేస్తాయా లేదా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండు పార్టీల అధిష్ఠానాలు త్వరలోనే అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటిస్తే తప్ప కవిటి రాజకీయాలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం లేదు.

## అభ్యర్థుల గెలుపు కోసం హోరాహోరీగా కోట్ల చిత్రమ్మ ప్రచారం

**బేతంచేర్ల అక్టోబర్ 22 (మనం న్యూస్):** స్థానిక ఎన్నికల ప్రచారంలో పార్టీ అభ్యర్థుల కోసం హోరా హోరిగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల చిత్రమ్మ తండ్రి డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



ఆదేశాల మేరకు బేతంచేర్ల స్థానిక ఎన్నికల ప్రచారంలో 1 వార్డు 7 వార్డు 8 వార్డుల లో చైర్మన్ అభ్యర్థి లోకేష్ గౌడ్ కౌన్సిల్ అభ్యర్థులు గెలిపిస్తే పట్టణంలో అభివృద్ధి పనులు చేస్తాం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అందరూ చైర్మన్ లోకేషన్ కౌన్సిల్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు కార్యక్రమం తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొలి టీ20లో కివీస్ పై రికార్డు విజయం

## అభిషేక్ శర్మ ప్రపంచ రికార్డు



టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ మరో వరల్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ లో ఆడిన తొలి బంతికే అత్యధికసార్లు సిక్సర్ బాదిన ప్లేయర్గా అభిషేక్ చరిత్ర సృష్టించాడు. క్రైస్ట్ చర్చ్ వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న తొలి టీ20లో సిక్సర్ తో తన పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్.. ఈ అరుదైన ఫీట్ ను సొంతం చేసుకున్నాడు.

ఈ పంజాబ్ బ్యాటర్ ఇప్పటివరకు తను ఆడిన తొలి బంతికే 7 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ ప్లేయర్ షఫికుల్లా షిన్వారీ(6) పేరిట ఉండేది. తాజా మ్యాచ్ తో షిన్వారీ ఆల్ టైమ్ రికార్డును అభిషేక్ బ్రేక్ చేశాడు.

కాగా పొట్టి క్రికెట్ లో అభిషేక్ తన సూపర్ ఫామ్ను కొనసాగిస్తున్నాడు. ఈ మ్యాచ్ లో కూడా కేవలం 12 బంతుల్లో 29 పరుగులు చేసి భారత్ కు శుభారంభం అందించాడు. అంతకుముందు విండీస్ సిరీస్ లో కూడా అభిషేక్ సత్తాచాటాడు.

**ఫిలిప్స్ విధ్వంసం**

ఇక ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 4 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కివీస్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ (36 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలవగా.. ఫిన్ అలెన్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులతో 45), బెవాన్ జాకబ్స్ (16 బంతుల్లో 31) రాణించారు.

భారత బౌలర్లలో అర్షీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలా ఒక వికెట్ పడగొట్టారు. లక్ష్య చేధనలో భారత బ్యాటర్లు కూడా దూకుడుగా ఆడుతున్నారు. సంజూ శాంసన్ కేవలం 23 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్కు పూర్తి చేసుకున్నాడు.





***మొన్నటి వరకూ స్వదేశంలో ఆడిన టీమ్ఇండియా.. దాదాపు నెల రోజులపాటు సాగే పర్యటన కోసం న్యూజిలాండ్లో అడుగు పెట్టింది. ప్రయాణబడలిక తీరకముందే మైదానంలోకి దిగాల్సి వచ్చింది. ఎలా ఆడతారోనని అభిమానులు కాస్త అందోళనకు గురైనా.. తమకు ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాటలను నిజం చేస్తూ టీమ్ఇండియా అదరగొట్టింది. రికార్డు లక్ష్య ఛేదన చేసి చరిత్ర సృష్టించింది. ఐదు టీ20ల సిరీస్ లో భారత్ శుభారంభం చేసింది. 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.***

క్రైస్ట్ చర్చ్ మైదానంలో జరిగిన తొలి టీ20లో కివీస్ పై భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో టీమ్ఇండియా ఆరు వికెట్లను కోల్పోయి 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి గెలిచింది. టీ20ల్లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఇంతకుముందు విశాఖపట్నంలో (2023) ఆస్ట్రేలియాపై 209 పరుగుల టార్గెట్ ను ఛేదించి టీమ్ఇండియా విజయం సాధించింది.

భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (67: 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు) విజృంభించాడు. కేవలం 23 బంతుల్లోనే అర్ధ శతకం సాధించి టీమ్ఇండియాకు బలమైన పునాది వేశాడు. ఆఖర్లో నమన్ ధిర్ (42: 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్ లు), శ్రేయస్ అయ్యర్ (42: 28 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సులు) దూకుడుగా ఆడి జట్టుకు విజయం అందించారు. అభిషేక్ శర్మ (29: 12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్ లు), అక్షర్ పటేల్ (24: 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) విలువైన పరుగులు చేశారు. తిలక్ వర్మ (6), ఇషాన్ కిషన్ (1) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో బ్రాస్ వెల్ 2, శాంట్నర్ 2, ఫెర్గూసన్, ఆడమ్ మిల్నే చెరో వికెట్ తీశారు. అర్ధ శతకంతో టీమ్ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. శనివారం ఇదే వేదికపై రెండో టీ20 మ్యాచ్ జరగనుంది.

**దంచేసిన ఫిలిప్స్.. ఇబ్బంది పడిన భువీ**

దాదాపు నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగిన భువనేశ్వర్ కుమార్ తొలి ఓవర్ ను అద్భుతంగా వేశాడు. కానీ, తన స్పెల్ లో మిగతా ఓవర్లలో భారీగా పరుగులు సమర్పించాడు. పవర్ ప్లేలో కనీసం ఒక్క వికెట్ అయినా తీసే అతడు.. 4 ఓవర్లలో 49 పరుగుల ఇచ్చి వికెట్ లేకుండా కోటా ముగించాడు. టిమ్ సీఫర్ట్ (24), ఫిన్ అలెన్ (45) దూకుడు దెబ్బకు భువీతోపాటు అర్ష్ దీప్ పవర్ ప్లేలో భారీగానే పరుగులు ఇచ్చారు. మయాంక్ వచ్చి సీఫర్ట్ను ఔట్ చేయడంతో కాస్త స్కోరు బోర్డు వేగం మందగించింది. డారిల్ మిచెల్ (28)తో కలిసి ఫిన్ ఇన్నింగ్స్ ను నడిపించేందుకు ప్రయత్నించాడు. అతడు పెవిలియన్కు చేరాక వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (82: 40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్ లు) దూకుడుగా ఆడాడు. బెవోన్ జాకబ్స్ (31: 16 బంతుల్లో 3 సిక్స్ లు) కూడా వేగంగా ఆడాడు. దీంతో కివీస్ స్కోరు 220+ దాటేసింది. భారత బౌలర్లు మయాంక్, అక్షర్, అర్ష్ దీప్ తలో వికెట్ తీశారు.

## శుభ్ మన్ గిల్ 'వన్డే' రికార్డు బద్దలుకొట్టిన హ్యారీ బ్రూక్



వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు టీమ్ఇండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ పేరిట ఉన్న ఆ ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరఫునా ఆ ఫీట్ను సాధించిన తొలి ప్లేయర్ గానూ నిలిచాడు. ఇంతకీ అదేంటంటారా? వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్ గా హ్యారీ బ్రూక్ అవతరించాడు.

శ్రీలంకతో మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (202: 116 బంతుల్లో 21 ఫోర్లు, 10 సిక్స్ లు) అదరగొట్టాడు. కేవలం 114 బంతుల్లోనే డబుల్ సెంచరీ బాదేశాడు. ఈ క్రమంలో గిల్ (117 బంతుల్లో) పేరిట ఉన్న వేగవంతమైన ద్విశతకం ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరఫున డబుల్ సెంచరీ.. అత్యధిక వ్యక్తిగత నమోదు చేసిన బ్యాటరూ బ్రూకే కావడం గమనార్హం. గతంలో బెన్ స్టోక్స్ న్యూజిలాండ్ పై 2023లో చేసిన 182 పరుగులే ఇప్పటి దాకా అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇప్పుడు ఆ ఘనతనూ బ్రూక్ తన ఖాతాలో వేసుకున్నాడు.

## కొత్త లుక్‌లో మహేశ్

టాలీవుడ్ సూపర్స్టార్ మహేశ్ బాబు తన మోస్ట్ అవేటెడ్ గ్లోబల్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి' తాజా షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకొని తాజాగా హైదరాబాద్ కు తిరిగి వచ్చారు. మహేశ్ బాబు తన కుటుంబంతో కలిసి నిన్న రాత్రి హైదరాబాద్ ఎయిర్ పోర్టులో కనిపించారు. ఈ ట్రిప్ లో ఆయన ఆకుపచ్చ క్యాప్, డార్క్ ఓవర్ కోట్, మెరూన్ టీషర్ట్, నల్లటి ప్యాంటుతో చాలా స్టైలిష్ గా కనిపించారు. గత కొంతకాలంగా 'వారణాసి' కి సంబంధించిన క్యారెక్టర్ కోసం లాంగ్ హెయిర్, గడ్డంతో కనిపించిన మహేశ్ బాబు, ప్రస్తుతం తన మెజారిటీ షూటింగ్ భాగం పూర్తికావడంతో మళ్లీ తన క్లాసిక్ క్లీన్ షేవెన్ (క్లీన్ లుక్) అవతారంలోకి మారారు. ఎయిర్ పోర్టులో క్లాసిక్ స్టైలిష్ లుక్ లో ఉన్న మహేశ్ బాబు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి' షూటింగ్ లో మహేశ్ బాబు ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉన్నారు. సుమారు 1400 కోట్ల భారీ బడ్జెట్తో తెరకెక్కుతున్న ఈ పాన్ వరల్ మూవీలో ప్రియాంక చోప్రా జోనస్, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. మహేశ్ బాబు 'రుద్ర' అనే పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. హైదరాబాద్ తో పాటు కెన్యా, జార్జియా వంటి విదేశీ లొకేషన్లలో కీలక సన్నివేశాలను తెరకెక్కించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల మహేశ్ నటనపై రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాను ఊహించినదాని కంటే రెట్టింపు స్థాయిలో నటించి మహేశ్ బాబు 'రుద్ర' పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ కీర్తిని గ్లోబల్ స్థాయిలో మరో స్థాయికి తీసుకెళ్లేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం, 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. రాజమౌళి-మహేశ్ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## బోల్డ్ అండ్ ఇండిపెండెంట్ క్యారెక్టర్‌లో శృతి హాసన్

మల్టీ టాలెంటెడ్గా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నా.. స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ప్రజెంట్ శృతి నటిస్తున్న చిత్రాల్లో 'ఆకాశంలో ఒక తార' ఒకటి. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాణ్ హీరోగా, పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో శృతి పాత్రకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ బజ్ నెట్టింట సందడి చేస్తుంది. స్ట్రాంగ్ అండ్ మీనింగ్ఫుల్ క్యారెక్టర్స్తో సందడి చేసే శృతి హాసన్.. ఈ మూవీలో కూడా ఒక స్ట్రాంగ్ రోల్ చేయబోతుందట.

ఇందులో శృతి బోల్ అండ్ ఇండిపెండెట్ ఉమెన్ క్యారెక్టర్లో నటిస్తుందని ఓ వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతుండగా.. శృతి హాసన్ ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. కాగా.. 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో దుల్కర్ సల్మాన్ 'కృష్ణ' అనే కీలక పాత్రలో నటిస్తుండగా, సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్, లైట్ బాక్స్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.



## ఆ అనుభూతి నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంది.. సాయి పల్లవి



బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక పౌరాణిక చిత్రం 'రామాయణ'. స్టార్ డైరెక్టర్ నితేశ్ తివారీ ఎంతో గ్రాండ్ గా విజువల్ వండ ర్గా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్టులో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తుండగా.. అత్యంత పవర్ ఫుల్ పాత్ర రావణాసురుడిగా రాకింగ్ స్టార్ యశ్ కనిపించనున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. ఇటీవల విడుదల చేసిన రావణాసురుడు (యశ్) గ్లింప్స్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. ఇందులో భాగంగానే తాజాగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి పంచుకున్న విశేషాలు 'రామాయణ'పై మరింత ఎక్స్ పెక్టేషన్స్ పెంచేస్తున్నాయి.

'మీరు రామాయణ సినిమాను తప్పకుండా 3ṛలో చూడాలి. నేను మొబైల్ లో ట్రైలర్ చూసినప్పుడు కలిగిన అనుభూతి ఒకలా ఉంది. కానీ 3ṛ గ్లాసెస్ పెట్టుకుని థియేటర్ లో ట్రైలర్ చూసినప్పుడు కలిగిన అనుభూతి మాత్రం నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంది. నాసిరకమైన లేదా సాధారణ స్థాయి వెర్షన్ ను తీసుకురావడం తనకు ఇష్టం లేదని నమిత్ చెప్పారు. ఇంతటి గొప్ప కథను ప్రపంచానికి అందించబోతున్నందుకు భారతీయులుగా మేం గర్వపడుతున్నాం. అంతే కాకుండా ఇలాంటి పవిత్రమైన ప్రాజెక్టులో నేను భాగం కావడం మరింత సంతోషంగా ఉంది' అని చెప్పుకొచ్చింది సాయి పల్లవి.

## 'ఫౌజీ' సెట్స్ నుంచి ప్రభాస్ వీడియో లీక్? అభిమానుల్లో గూస్ బంప్స్!?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న క్రేజీ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం 'ఫౌజీ'. ఈ మూవీకి సంబంధించి వీడియో క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'ఫౌజీ' సెట్స్ నుంచి ప్రభాస్ లుక్ అంటూ ఓ వీడియో నెట్టింట ప్రత్యక్షమయింది. మిలిటరీ గెటప్లో, సింహాసనంపై ప్రభాస్ రాజసంగా కూర్చుని ఉన్న ఈ వీడియో చూసి అభిమానులు పండగ చేసుకుంటున్నారు. అయితే, ఈ వీడియో నిజమైందేనా? దీని వెనుక ఉన్న అసలు నిజాలు ఏమిటనే దానిపై టాలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.



**అభిమానుల సంతోషంపై నీళ్లుచల్లిన ఏఐ..**

ఈ వైరల్ వీడియోపై ఫ్యాక్ట్ చెక్ చేయగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వీడియోలోని దృశ్యాలు పూర్తిగా నిజమైన షూటింగ్ స్పాట్ లీక్ కాదని, వీటిని గూగుల్ ఏఐ తో సృష్టించి, ఎడిట్ చేసినట్లు స్పష్టమైన వాటర్మార్క్ ఉన్నాయి. వీడియో ప్రారంభంలోని కొన్ని సెకన్లలో ఏఐ సృష్టికి సంబంధించిన సంకేతాలు స్పష్టంగా గుర్తించబడ్డాయి. అయితే, ఆడియో పరంగా ఎలాంటి ఏఐ వాటర్మార్క్ లభించలేదు. కాబట్టి, ఇది అధికారికంగా సినిమా యూనిట్ విడుదల చేసిన టీజర్ లేదా ఒరిజినల్ లీక్డ్ వీడియో కాదని, అభిమానులు లేదా కొందరు సృష్టించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టి అని తేలింది.

**సినిమాపై భారీ అంచనాలు..**

మ్యాజికల్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో ప్రభాస్ సరికొత్త సైనిక అధికారి పాత్రలో కనిపించబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి సమయంలో ఈ ఏఐ క్రియేటెడ్ వీడియో నెట్టింట వైరల్ కావడం విశేషం. అధికారికంగా మేకర్స్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చే వరకు ఇలాంటి సోషల్ మీడియా లీకులు, ఏఐ సృష్టితులను నమ్మవద్దని టాలీవుడ్ వర్గాలు సూచిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ప్రభాస్ మేనియాను ఇలాంటి ఫ్యాన్ మేడ్ క్రియేషన్స్ మరోసారి ఇంటర్నెట్లో ట్రెండ్ అయ్యేలా చేస్తున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.